## విలేకరులు కావలెను

మనవార్త దినపత్రిక లో
పనిచేయుటకు విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను
Cell: 9247819181
8309605189

# మన వార్త
ప్రజాగళానికి అక్షర రూపం
MANA VAARTHA

EPAPER.MANAVAARTHA.NET
MANA VAARTHA

Telangana | సంపుటి: 1, సంచిక: 227 | volume: 1, Issue: 227 | సోమవారం 16 మార్చి 2026 పేజీలు : 8 వెల : 3.00

## బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో కీలక మార్పు



**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో ఈసారి కీలక మార్పు చోటుచేసుకుంది. గత ఎన్నికల్లో ఎనిమిది దశల్లో జరిగిన పోలింగ్‌కు బదులుగా ఈసారి కేవలం రెండు దశల్లోనే ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఈ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు. ఈ నిర్ణయం బెంగాల్ రాజకీయాల్లో చర్చకు దారితీస్తోంది. ఈ షెడ్యూల్ ప్రకారం పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23 మరియు ఏప్రిల్ 29 తేదీలలో రెండు దశల్లో పోలింగ్ జరుగుతుంది. అనంతరం మే 4న ఓట్ల లెక్కింపు నిర్వహించి ఫలితాలు వెల్లడించనున్నారు. గతంలో జరిగిన ఎన్నికలతో పోలిస్తే ఈసారి పోలింగ్ దశలను భారీగా తగ్గించడం ఎన్నికల నిర్వహణలో ముఖ్యమైన మార్పుగా భావిస్తున్నారు. 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌లో మార్చి చివరి వారంలో పోలింగ్ ప్రారంభమై ఏప్రిల్ 29 వరకు కొనసాగింది. దాదాపు నెల రోజులపాటు ఎనిమిది దశల్లో ఎన్నికలు నిర్వహించారు. భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది వినియోగం వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని అప్పట్లో ఎక్కువ దశల్లో పోలింగ్ నిర్వహించారు. ఈసారి మాత్రం విస్తృతంగా చర్చలు జరిపిన తర్వాత పోలింగ్ దశలను తగ్గించాలని ఎన్నికల సంఘం నిర్ణయించినట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ తెలిపారు. ఇదే సమయంలో అస్సాం, కేరళ, తమిళనాడు రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో ఎన్నికలు ఒక్కో దశలోనే జరగనున్నాయి. అస్సాం, కేరళ, పుదుచ్చేరిలో ఏప్రిల్ 9న పోలింగ్ నిర్వహించగా, తమిళనాడులో ఏప్రిల్ 23న ఓటింగ్ జరుగుతుంది. మే 4న అన్ని రాష్ట్రాల ఫలితాలు ఒకేసారి వెల్లడించనున్నారు.

## తెలంగాణలో నేడు, రేపు వర్షాలు



**-ఉరుములు, మెరుపులతో వర్షాల హెచ్చరిక...**
**-ఈదురుగాలులతో కొన్ని జిల్లాల్లో వర్షం అవకాశం...**
**-ద్రోణి ప్రభావంతో మారిన వాతావరణం...**

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో ఆదివారం, సోమవారం రోజుల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వాతావరణ పరిస్థితులు మారే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా ఉత్తర, పశ్చిమ తెలంగాణ జిల్లాల్లో ఆదివారం ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముందని పేర్కొంది. ఈ నేపథ్యంలో పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ద్రోణి ప్రభావంతో తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి తేమ గాలులు రాష్ట్రంలోకి ప్రవేశిస్తున్నాయని వాతావరణ శాఖ వివరించింది. ఈ కారణంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని మేఘావృత పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో చల్లని గాలులు కూడా వీచే అవకాశం ఉందని పేర్కొంది. ఈ ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమై చల్లని గాలులు వీచుతున్నాయని అధికారులు తెలిపారు. వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ సూచించింది. ముఖ్యంగా రైతులు పంటలను రక్షించుకునే చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

## అస్సాంలో ఆరోగ్య రంగానికి భారీ ప్రోత్సాహం



**గువాహట:** అస్సాం రాష్ట్రంలో ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న చర్యలు వేగం పుంజుకుంటున్నాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. రాష్ట్రంలో ఆధునిక వైద్య సదుపాయాలను అభివృద్ధి చేసే దిశగా రూ.2,092 కోట్ల విలువైన పలు ఆరోగ్య ప్రాజెక్టులను ప్రారంభించడం మరియు వాటికి శంకుస్థాపన చేయడం జరిగిందని ఆయన వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు వాయువ్య భారతదేశంలో వైద్య సేవలను మరింత విస్తరించే దిశగా కీలకంగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు. అస్సాం రాష్ట్రం ఆరోగ్య సేవల రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతూ వాయువ్య భారతానికి వైద్య కేంద్రంగా మారుతోందని అమిత్ షా పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికతతో కూడిన ఆసుపత్రులు, వైద్య పరికరాలు, నూతన ఆరోగ్య సదుపాయాల ఏర్పాటు ద్వారా ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రంలోని దూర ప్రాంతాల ప్రజలకు కూడా మెరుగైన చికిత్స అందే విధంగా వైద్య మౌలిక వసతులను విస్తరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన అన్నారు. ఈ భారీ ఆరోగ్య ప్రాజెక్టులు అమలులోకి రావడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ కృషి ముఖ్యమని ఆయన ప్రశంసించారు. రాష్ట్ర ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆయన అన్నారు. ఆరోగ్య రంగంలో పెట్టుబడులు పెరగడం వల్ల ప్రజలకు మెరుగైన చికిత్స మాత్రమే కాకుండా వైద్య రంగంలో కొత్త అవకాశాలు కూడా ఏర్పడతాయని తెలిపారు. అస్సాం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతోందని, మౌలిక సదుపాయాలు, ఆరోగ్యం, విద్య వంటి రంగాల్లో పెద్ద ఎత్తున ప్రాజెక్టులు అమలవుతున్నాయని అమిత్ షా పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్ర ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందుతాయని, అస్సాం అభివృద్ధికి ఇది కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

## మాజీ డీజీపీ హెచ్.జే. దొర నివాసానికి బండి సంజయ్



**-కుటుంబ సభ్యులను పరామర్శించిన కేంద్ర మంత్రి..**
**-పోలీస్ సేవలను గుర్తుచేసుకున్న బండి సంజయ్...**
**-సాహసోపేత సేవలను కొనియాడిన కేంద్ర నాయకుడు...**

**హైదరాబాద్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్.జే. దొర నివాసానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన మరణం పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ పోలీసు విభాగంలో హెచ్.జే. దొర చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో తీవ్రవాదాన్ని ఎదుర్కొనే క్రమంలో ఆయన చూపిన ధైర్యం, నాయకత్వం పోలీసు శాఖలో ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. పోలీసు వ్యవస్థలో నిజాయితీతో పనిచేసిన అధికారిగా దొర పేరు నిలిచిపోయిందని చెప్పారు. కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం మహానిర్వాహకుడిగా కూడా ఆయన దేశానికి కీలక సేవలు అందించారని గుర్తు చేశారు. అతని సేవలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొంటూ దొర కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యం ఇవ్వాలని ఆకాంక్షించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## హెలిప్యాడ్‌లోకి ఆవు అధికారుల్లో గందరగోళం



**బీహార్:** బీహార్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి హెలికాప్టర్ ల్యాండింగ్‌కు ముందు చోటుచేసుకున్న ఓ విచిత్ర ఘటన సోషల్ మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కార్యక్రమం కోసం బెగుసరాయ్ జిల్లాకు రావాల్సి ఉండగా హెలిప్యాడ్ వద్ద భద్రతా ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో ఒక ఆవు అకస్మాత్తుగా లోపలికి ప్రవేశించడం కలకలం రేపింది. సమృద్ధి యాత్రలో భాగంగా ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో బెగుసరాయ్‌లోని పారిశ్రామిక ప్రాంత అభివృద్ధి సంస్థ ప్రాంగణానికి రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అధికారులు హెలిప్యాడ్ వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. పోలీసులు, ఇతర అధికారులు హెలికాప్టర్ రాక కోసం వేచి ఉన్న సమయంలో ఊహించని సంఘటన జరిగింది. ఎక్కడి నుంచి వచ్చిందో తెలియని ఒక ఆవు ఒక్కసారిగా బారికేడ్లు దాటి హెలిప్యాడ్ ప్రాంతంలోకి ప్రవేశించింది. ఆవు వేగంగా అక్కడి ప్రాంగణంలో పరుగులు తీయడంతో భద్రతా సిబ్బంది కంగారు పడ్డారు. ఆవును బయటకు పంపేందుకు పోలీసులు ప్రయత్నించగా కొంతసేపు అక్కడ గందరగోళ పరిస్థితి నెలకొంది. కొంతసేపటి తర్వాత ఆవు అక్కడి నుంచి బయటకు వెళ్లిపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ముఖ్యమంత్రి రాకకు ముందే పరిస్థితి సాధారణంగా మారింది. అయితే ఈ సంఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మాధ్యమాల్లో వైరల్ అవుతూ విస్తృతంగా చర్చకు దారితీస్తోంది.

## ప్రేమకు కుటుంబం వ్యతిరేకం జంట హత్య




**అహ్మదాబాద్:** గుజరాత్ రాష్ట్రంలో ప్రేమించిన జంటను యువతి కుటుంబ సభ్యులే హత్య చేసిన దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. ప్రేమ సంబంధాన్ని అంగీకరించని కుటుంబ సభ్యులు యువతి, ఆమె ప్రియుడిని హత్య చేసి మృతదేహాలను బావిలో పడేసిన ఘటన రాజ్‌కోట్ జిల్లాలో చోటుచేసుకుంది. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం ఖత్రానా పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన 19 ఏళ్ల నాతి అలియాస్ సోను రబారీ, 21 ఏళ్ల నవీన్ జీవాభాయ్ రబారీ ప్రేమించుకున్నారు. ఫిబ్రవరి 3న ఈ ఇద్దరూ కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు మిస్సింగ్ ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో ఈ ఇద్దరి మధ్య ప్రేమ సంబంధం ఉన్నట్లు తెలిసింది. అయితే ఆ సంబంధాన్ని యువతి కుటుంబం తీవ్రంగా వ్యతిరేకించినట్లు పోలీసులు గుర్తించారు. ప్రేమను ముగించాలని కుటుంబ సభ్యులు పలుమార్లు హెచ్చరించినప్పటికీ వారు అంగీకరించకపోవడంతో ఘోర నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడైంది. ఫిబ్రవరి 3న యువతి తండ్రి, మేనల్లుడు కలిసి ఆ జంటను ఖంభాలా గ్రామానికి తీసుకెళ్లారు. అక్కడ యువతి తల్లి, సోదరుడితో కలిసి వారిద్దరి గొంతు నొక్కి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం సమీపంలోని బావిలో మృతదేహాలను పడేశారని చెప్పారు. నెల రోజుల తర్వాత యువతి తండ్రి ఈ నేరాన్ని ఒప్పుకోవడంతో అగ్నిమాపక సిబ్బంది సహాయంతో బావి నుంచి మృతదేహాలను వెలికి తీశారు. ఈ కేసులో యువతి తల్లిదండ్రులు, మేనల్లుడు, మైనర్ అయిన సోదరుడిని పోలీసులు అరెస్ట్ చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## పలు అభివృద్ధి పనులకు భూమి పూజలు చేసిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి...



**నార్సింగి మార్చి 15 ( మన వార్త ప్రతినిధి )** రాబోయే మూడు సంవత్సరాలలో జిల్లా లోనే నార్సింగి గ్రామాన్ని అభివృద్ధి లో తొలి స్థానంలో నిలుపుతామని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నార్సింగి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని 5, 10, 13 వార్డులలో ఎన్ ఆర్ ఈ జీ ఎస్ నిధుల ద్వారా మంజూరయిన 25 లక్షల రూపాయల నిధులతో నిర్మాణం చేపట్టే సీసీ రోడ్ల పనులకు సర్పంచ్ ఆకుల సుజాత మల్లేశ్ గౌడ్ ఆధ్వర్యంలో దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి భూమి పూజ నిర్వహించారు . ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత ఏడాది నార్సింగి కు దాదాపు 90 లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం తో పాటు 96 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి నిర్మాణం చేపడుతున్నామని, ప్రస్తుతం 25 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని అన్నారు. వంద శాతం సీసీ రోడ్లు నిర్మించి, ఇళ్లు లేని పేదలు లేకుండా రాష్ట్రాన్ని తీర్చి దిద్దడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని అన్నారు. గ్రామభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకట స్వామి, చెరుకు శ్రీనివాస్ రెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణానికి ఇంకా నిధులు అవసరమున్నాయని, చెరుకు శ్రీనివాస్ రెడ్డి కృషి చేసి నిధులను మంజూరు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ యెన్నం రాజేందర్ రెడ్డి, వార్డు సభ్యులు కందరి నవీన్, జీవిత రాజు, అటో జానీ, కటికే రాజేందర్, ఆకుల నరేష్, బాచి స్వామి, మాజీ వైస్ ఎంపీపీ ఆకుల మల్లేశ్ గౌడ్, నాయకులు బక్కన్నగారి సంపత్ రెడ్డి, బాలరాజు గౌడ్, రాజేష్, జహీర్ , స్వామి తదితరులు పాల్గొన్నారు.

## సిరికొండ మండల్ రీల్స్ ఛాలెంజ్– యువత మేలుకో గంజాయి మానుకో

**–హెల్పింగ్ హార్ట్ పౌండేషన్ చైర్మన్ ఐనలా శ్రీకాంత్ ...**

**నిజామాబాద్ జిల్లా సిరికొండ (మన వార్త )మర్చి 15** సిరికొండ మండలంలో యువతలో సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు గంజాయి వంటి మత్తు పదార్థాలపై అవగాహన కల్పించేందుకు సిరికొండ మండల్ రీల్స్




ఛాలెంజ్ యువత మేలుకో, గంజాయి మానుకో" అనే ప్రత్యేక కార్యక్రమాన్ని హెల్పింగ్ హార్ట్ ఫౌండేషన్ వారు నిర్వహిస్తున్నారు. ఫౌండేషన్ చైర్మన్ అయినాల శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా మండలంలోని అన్ని గ్రామాల యువకులకు తమ ప్రతిభను ప్రదర్శించే అద్భుతమైన అవకాశం లభిస్తుంది. ఈ కార్యక్రమంలో భాగంగా యువత తమ తమ గ్రామాల సామాజిక, సాంస్కృతిక సంప్రదాయాలు, పల్లె మనుషుల జీవన విధానం, గ్రామ అభివృద్ధి వంటి అంశాలపై వీడియో రీల్స్ రూపొందించి పాల్గొనవచ్చు. గ్రామాల అందాలు, రైతులు మరియు పంటలు, ఆలయాలు, సంప్రదాయాలు, పండుగలు వంటి ప్రత్యేకతలను వీడియోల రూపంలో చూపిస్తూ తమ గ్రామాన్ని ప్రపంచానికి పరిచయం చేసే అవకాశం ఈ కార్యక్రమం ద్వారా లభిస్తుందాని అన్నారు. వీడియో నిబంధనల ప్రకారం రీల్ పొడవు 5 నిమిషాలకు మించకూడదు. వీడియోలో గంజాయి వంటి మత్తు పదార్థాలను అరికట్టే సందేశంతో పాటు గ్రామ అందాలు, రైతులు పంటలు, ఆలయాలు సంప్రదాయాలు, గ్రామ అభివృద్ధి వంటి అంశాలు తప్పనిసరిగా ఉండాలి. ప్రఖ్యాత న్యాయనిర్ణేతల పరిశీలన ఆధారంగా ఉత్తమ వీడియోలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రదానం చేయబడతాయి. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తమ ప్రతిభను సమాజానికి ఉపయోగపడే విధంగా ప్రదర్శించాలని కోరారు.

## పదవ తరగతి విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పిన ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షులు మొట్టల దీపక్ మాదిగ



**నిజామాబాద్ జిల్లా సిరికొండ( మన వార్త) మార్చి 15** 10వ తరగతి విద్యార్థులకు ఆల్ ది బెస్ట్: ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షులు మొట్టల దీపక్ మాదిగ సిరికొండ: రానున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులందరికీ ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షులు మొట్టల దీపక్ మాదిగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పరీక్షలు విద్యార్థుల జీవితంలో కీలకమైన మలుపు అని, కాబట్టి విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఆయన పిలుపునిచ్చారు.ఏధైర్యంగా పరీక్షలు ఎదుర్కోండి: విద్యార్థులు పరీక్షలను ధైర్యంగా ఎదుర్కోవాలని, అనవసరమైన ఒత్తిడికి లోనుకాకూడదని దీపక్ మాదిగ సూచించారు. తాము ఇప్పటి వరకు చదివిన విషయాలను పునశ్చరణ చేసుకుని, సమయపాలన పాటిస్తూ సమాధానాలు రాయాలని కోరారు. ఒక పరీక్ష ఆశించిన స్థాయిలో రాయలేకపోతే, దాని గురించి ఆలోచించి తదుపరి పరీక్షలను పాడుచేసుకోకూడదని ఆయన హితవు పలికారు.ఏఆరోగ్యం పట్ల శ్రద్ధ: పరీక్షల సమయంలో విద్యార్థులు తమ ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ వహించాలని దీపక్ మాదిగ గుర్తుచేశారు. సమయానికి పౌష్టికాహారం తీసుకోవాలని, సరిపడా నిద్రపోవాలని సూచించారు. ఇది మెదడు చురుగ్గా పనిచేయడానికి మరియు పరీక్షలపై దృష్టి పెట్టడానికి సహాయపడుతుందని ఆయన అన్నారు.ఏతల్లిదండ్రుల పాత్ర: విద్యార్థులకు అవసరమైన మానసిక మరియు నైతిక మద్దతు ఇవ్వడంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని దీపక్ మాదిగ పేర్కొన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులను ఒత్తిడికి గురిచేయకుండా, వారికి సానుకూల వాతావరణం కల్పించాలని కోరారు. అలాగే, విద్యార్థులకు అవసరమైన పరీక్షా సామాగ్రిని ముందుగానే సమకూర్చుకోవాలని సూచించారు.ఏభవిష్యత్తుపై నమ్మకం: 10వ తరగతి పరీక్షలు కేవలం ఒక మెట్టు మాత్రమేనని, వాటి తర్వాత విద్యార్థులకు ఉజ్వలమైన భవిష్యత్తు ఉందని దీపక్ మాదిగ విశ్వాసం వ్యక్తం చేశారు. విద్యార్థులు తమపై నమ్మకంతో ముందుకు సాగాలని, విజయం సాధిస్తారని ఆయన ఆకాంక్షించారు. అలాగే, పరీక్షా కేంద్రాలలో కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## జాతీయ రహదారి పక్కనే మద్యం దుకాణాలు

### ప్రయాణికుల నానా ఇబ్బందులు



**జహీరాబాద్, మార్చి 15 (మన వార్త):** జాతీయ రహదారి 65 పక్కన, జహీరాబాద్ పట్టణ నడిబొడ్డున ఉన్న వైన్స్ షాపుతో పలు రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ప్రజలు తమ గోడును వెళ్లిబుచ్చుకుంటున్నారు. ఆయా రాష్ట్రాల యువత తమ జీవనాధారంలో భాగంగా స్కిల్డ్, అన్ స్కిల్డ్, గృహ నిర్మాణ కార్మికులు గా వేల సంఖ్యలో జహీరాబాద్ కు నివాసం ఉంటున్నారు. జహీరాబాద్ లో ఎప్పుడంటే అప్పుడు, ఎక్కడ పడితే అక్కడ వైన్స్, బెల్ట్ షాపుల ద్వారా మద్యం అందుబాటులో ఉండడంతో స్థానిక మందు ప్రియులతో పాటు, వలస వచ్చిన కార్మికులు మద్యానికి అలవాటు పడటంతో, మద్యం వ్యాపారుల లాభాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా వెలుగుతున్నాయి. మద్యం వ్యాపారులు మద్యం ప్రియుల బానిసత్వాన్ని అదునుగా చేసుకుని నాసిరకం మద్యం అమ్మడంతో పాటు, అధిక ధరలకు మద్యం అమ్ముతున్నట్లు కొందరు చెప్పుకుంటున్నారు. సంబంధిత శాఖ అధికారులు కూడా మద్యం వ్యాపారుల అక్రమాలను చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు వినికిడి ఉన్నది. సంబంధిత శాఖ అధికారుల నిర్లక్ష్య ధోరణిని అదునుగా చేసుకుని ప్రభుత్వ నిబంధనలు పట్టించుకోకుండా ఎక్కడ పడితే అక్కడ వైన్స్ షాపులు, బెల్ట్ షాపులు తెరిచి, మద్యం ప్రియులను మరింత ఆకర్షణకు గురి చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొందరు వైన్స్ దుకాణం ముందే మద్యం సేవించి, అక్కడే రోడ్డుపై పడిపోతున్నారు. జహీరాబాద్ పట్టణ ఆర్టీసీ బస్టాండు పక్కన, జాతీయ రహదారి పక్కనే మద్యం దుకాణం ఉండడం మరి ఘోరమైన పరిస్థితి అని, ఇది ప్రజల జీవితాలను నాశనం చేసే దిశగా ఉందని విచారం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడూ రద్దీగా ఉండే జాతీయ రహదారి పక్కన ఉన్న మద్యం దుకాణాలతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మద్యం కొనడానికి వచ్చిన మద్యం ప్రియులు తమ వాహనాలను జాతీయ రహదారి పై పార్కింగ్ చేయడంతో, కారు, ద్విచక్ర, బస్సుల పై తమ గమ్య స్థానాలకు వెళ్ళే ప్రయాణికులతో పాటు, పాదచారులు కూడా అక్కడి వైన్స్ షాపులతో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుపుతున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో పెట్టుకుని సంబంధిత శాఖా అధికారులు తగు చర్యలు తీసుకుని, జాతీయ రహదారి పక్కన ఉన్న మద్యం దుకాణాలను తొలగించాలని సామాజిక విద్యావంతులు, మహిళలు కోరుతున్నారు.

## ఘనంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక...



**– పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం...**

**శంకరపట్నం:మార్చి15(మనవార్త ప్రతినిధి)**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి పాలన 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా ఆదివారం వివిధ గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం,వైద్య పరీక్షలు నిర్వహించారు. శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామ సర్పంచ్ పూదరి రాజు పాలకవర్గ సభ్యులతో కలిసి పారిశుద్ధ్య కార్మికులను సన్మానించి,వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పూదరి రాజు మాట్లాడుతూ,,గ్రామం శుభ్రంగా,ఆరోగ్యంగా ఉండటంలో పారిశుద్ధ్య కార్మికుల శ్రమ వెలకట్టలేనిదని కొనియాడారు. మేము కోరుకున్న ఆదర్శ గ్రామపంచాయతీ దిశగా అడుగులు వేస్తున్నామని ఇందులో కార్మికులది కీలక పాత్ర అని ఆయన పేర్కొన్నారు. సిబ్బందికి నిత్యవసర వస్తువులైన సబ్బులు,కొబ్బరి నూనె,శానిటైజర్లు,మాస్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దండు రాజేష్,పంచాయతీ కార్యదర్శి ఎలగందుల శ్రీనివాస్,వార్డు సభ్యులు,ఆశ వర్కర్లు,తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు పి పి ఈ నిత్యావసర కిట్లని అందజేత



**సిరికొండ సర్పంచ్ మల్లెల సాయి చరణ్ (మన వార్త) మార్చ్15** రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన 99 రోజుల ప్రణాళికలో భాగంగా ఈరోజు సిరికొండ సర్పంచ్ మల్లెల సాయిచరణ్ సిరికొండ పాలకవర్గం సమావేశం నిర్వహించి పారిశుద్ధ్య కార్మికులను సన్మానించి పి పి ఈ (నిత్యవసర వస్తువులు )కిట్లను పంపిణీ చేయడం జరిగింది వారి ఆరోగ్య క్షేమం కోసం హెల్త్ క్యాంపు ఏర్పాటు చేసి వారికి అన్ని రకాల టెస్టులు చేయించి వారి బాగోగులు తెలుసుకోనీ ఆరోగ్యం బాగా చూసుకోని చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గ్యమా శోభన్, పంచాయతీ కార్యదర్శి వినీల్ కారోబర్ ప్రవీణ్, వార్డ్ సభ్యులు దీనర్సయ్య, ఎ అశ్విని, బోల్గం హారిక, బోడలత, కనగందుల మురళి, కానాపురం సునీత, చిట్యాల రంజిత్,అల్లిపురం శంకర్,బాదావత్ తిరుపతి,

## ఘనంగా మాజీ ఎంపీ నామ జన్మదిన వేడుకలు

**–వేడుకల్లో కేక్ కట్ చేసిన మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు...**

**–నామ పేరుతో వినాయకుడి గుడిలో ప్రత్యేక పూజలు...**

**మధిర, మార్చి15( మన వార్త):**ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యులు, బీ.ఆర్.యస్ పార్టీ మాజీ లోక్ సభాపక్ష నేత నామ



నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను మధిర లో బీ.ఆర్.యస్ పార్టీ ఆద్వర్యం లో ఘనంగా నిర్వహంచారు. ముందుగా పార్టీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షులు తెలిపారు. అనంతరం పార్టీ పట్టణ, రూరల్ కమిటీ నాయకులు మధిర మెయిన్ రోడ్ నందు ఉన్న వినాయకుడి గుడిలో నామ నాగేశ్వరరావు పేరున ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపించారు. కార్యక్రమాల్లో మధిర పట్టణ పార్టీ అధ్యక్షులు పల్లపోతు వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు రావూరి శ్రీనివాసరావు, మాజీ సహకార సంఘం అధ్యక్షులు బిక్కి కృష్ణ ప్రసాద్, మధిర మున్సిపాలిటీ 19వ వార్డు బిఆర్ఎస్ కౌన్సిలర్ యన్నంశెట్టి వెంకట అప్పారావు, మండల పార్టీ కార్యదర్శి బొగ్గుల భాస్కర్ రెడ్డి, మధిర శివాలయం మాజీ అధ్యక్షులు వంకాయలపాటి నాగేశ్వరరావు, నాయకులు కొటారు రాఘవరావు, ధీరావత్ మాధవి, బొగ్గుల వీరారెడ్డి, ముత్తవరపు ప్యారి, ఆళ్ల నాగబాబు, పరిస శ్రీనివాసరావు, చీదిరాల రాంబాబు, అబ్దుల్ ఖురేషి, పెద్దపూడి సుధాకర్ ( చంటి), కోటిరెడ్డి, కుర్ర రంజిత్, కుమార్, లంకెమల్ల నాగేశ్వరావు, దోర్నాల శ్రీనివాసరావు, దోర్నాల కొండలరావు, చెరుకూరు కృష్ణారావు, ఆర్ఎంపి మల్లికార్జునరావు, దిల్, ఎరువ నాగరాజు, మల్లెల లింగయ్య, శీలం శివ, గొల్లపోలు కిరణ్, కర్నాటి శశి, కర్నాటి నాగేశ్వరరావు, తిరుపతి సతీష్, పులి గోపి తదితర నాయకులు పాల్గొన్నారు

## పారిశుద్ధ్య కార్మికులకు పి పి ఈ నిత్యావసర కిట్ల అందజేత



**–పోత్నూర్ గ్రామ సర్పంచ్ మైపాల్...**

**నిజామాబాద్ జిల్లా సిరికొండ (మన వార్త) మార్చ్ 15** ఈరోజు పోతునూరు గ్రామపంచాయతీలో ప్రజా పాలన ప్రగతి 99 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పోతునూరు గ్రామ పంచాయితీ సిబ్బందిని సన్మానించి పి పి ఈ నిత్యావసర కీట్లని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోర్నూర్ సర్పంచ్ మరియు పంచాయితీ పాలకవర్గం మరియు తదితరులు పాల్గొనడం జరిగింది.

## రాచర్ల గుండారం గ్రామంలో తొమ్మిది ఇందిరమ్మ ఇళ్ళు గృహాప్రవేశాలకు సిద్దం

**–క్యాన్సిల్ అయిన 104 ఇందిరమ్మ ఇళ్ళు...**

**–వివిధ దశలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ళ పనులను పరిశీలించిన ఏఎంసి చైర్మన్...**

**ఎల్లారెడ్డి పేట మార్చి 15 : (మన వార్తా ప్రతినిధి)**తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వము



ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు ఎల్లారెడ్డిపేట మండలం గుండారం గ్రామానికి మొదటి విడుతగా 184 ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తూ పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది, కాగా 80 మంది ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిదారులు ముందుకు వచ్చి ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తుండగా నూట నలుగు మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ముందుకు రాకపోవడంతో వాటిని అధికారులు క్యాన్సిల్ చేశారు, ఏఎంసీ చైర్మన్ షేక్ సాబేర బేగం ఆధ్వర్యంలో మండల సర్పంచుల పోరం అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య సర్పంచ్ మూడవ సరోజన ఉప సర్పంచ్ జెడ్పీ కిషన్ వార్డు సభ్యులు అమల గణేష్ గుగులోత్ పద్మ జెట్టి హరీషా మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు షేక్ గౌస్ భాయ్ మాజీ ఏఎంసీ డైరెక్టర్ సూడిది రాజేందర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండారి బాల్రెడ్డి గ్రామ శాఖ అధ్యక్షులు న్యాలపల్లి శ్రీనివాస్ చారి పంచాయతీ కార్యదర్శి దేవరాజు లు కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఆదివారం గ్రామంలో తిరిగి పరిశీలించారు, సిద్ధాల అఖిల కంకణాల శ్రీలత ఇందిరాల మమత లకావత్ సునీత చేనవేని శ్రావణి లాలా శ్యామల జజ్జెరి పద్మ భానోత్ లక్ష్మీ భూక్య లక్ష్మీ ల ఇందిరమ్మ ఇల్లు పూర్తి అయ్యి గృహప్రవేశాలకు సిద్ధంగా ఉన్నాయని మిగతావి వివిధ దశలో నిర్మాణాల్లో ఉన్నాయని పరిశీలించారు, గృహప్రవేశాలకు సిద్ధంగా ఉన్న ఇందిరమ్మ ఇళ్ళను ఈ నెల 18 వ తేదిన జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభించుకోవాలని నిర్ణయించారు,

## దుమల గ్రామంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుళ్ళపల్లి పద్మ నర్సింహారెడ్డి నూతన గృహప్రవేశం



**ఎల్లారెడ్డి పేట మార్చి 15: (మన వార్త ప్రతినిధి)**నూతన గృహప్రవేశం కార్యక్రమానికి హాజరైన సెస్ డైరెక్టర్ వరుస కృష్ణ హరి, మరియు జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, మరియు మాజీ జెడ్పీ చైర్మన్ న్యాలకొండ రాఘవ రెడ్డి, తిమ్మాపూర్ సర్పంచ్ అందె సుభాష్, ముస్తాబాద్ మండల సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు నిమ్మల బాబు. గ్రామ శాఖ అధ్యక్షులు బట్టు రాజు. గ్రామ నాయకులు రాజిరెడ్డి. గోపాల్ ఈ గృహప్రవేశంలో తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి వస్తువు కొనుగోలు కు రసీదు తీసుకోండి




**-ప్రపంచ వినియోగదారుల దినోత్సవం...**
**-హ్యూమన్ రైట్స్ కోట వెంకట్...**

**మధిర, మార్చి15( మన వార్త):**వినియోగదారులు కొనుగోలు చేసే ప్రతి వస్తువుకు రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని హ్యూమన్ రైట్స్ సభ్యులు కోట వెంకట్, కన్నెపోగు వెంకటేశ్వర్లు కె ఆంజయ్య ప్రకటన పూర్వకంగా తెలిపారు. అంతర్జాతీయ వినియోగదారులు దినోత్సవం సందర్భంగా తెలియజేస్తూ. కాలం చెల్లిన వస్తువులు అమ్మిన వారిపై, కఠిన చర్యలు తీసుకోవడానికి,అలాగే కూల్ డ్రింకులు, ఐస్ క్రీములు తదితర సంబంధిత వస్తువులు ఎమ్మార్పీ ధరలు కంటే అధికంగా విక్రయించినా వారి మీద కంప్లీట్ చేయవచ్చు అన్నారు. వారికి జరిమానా, జైలు శిక్ష పడే అవకాశం కూడా ఉందన్నారు. చట్టపరంగా చర్యలు తీసుకోవాలంటే రసీదు ఉండాలన్నారు. నష్టపోయిన వారు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల వినియోగదారుల ఫోరంను ఆశ్రయిస్తే తగిన న్యాయం జరుగుతుందన్నారు. ఆన్లైన్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

# 2027 జనాభా లెక్కలు దేశ అభివృద్ధికి కీలకం...

**-అధికారులు పూర్తి అవగాహనతో పని చేసి దిగ్విజయంగా పూర్తి చేయాలి...**
**-జిల్లా కలెక్టర్ ప్రధాన జనాభా గణన అధికారి అనురాగ్ జయంతి...**

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 15** 2027 జనాభా లెక్కలు దేశ అభివృద్ధికి ఎంతో కీలకం అని , అధికారులు పూర్తి అవగాహనతో , క్షేత్రస్థాయిలో బాధ్యతగా పని చేసి ఈ




కార్యక్రమాన్ని దిగ్విజయం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ , ప్రధాన జనాభా గణన అధికారి అనురాగ్ జయంతి పేర్కొన్నారు. జిల్లాలో జనాభా గణన-2027 సమర్థంగా నిర్వహించేందుకు జిల్లా , మండల స్థాయి అధికారులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ , ప్రధాన జనాభా గణన అధికారి ఆదివారం కలెక్టర్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు , రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి , లతో కలసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ , ప్రధాన జనాభా గణన అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన నిబంధన ప్రకారం క్షేత్ర స్థాయిలో అధికారులు పక్కాగా సర్వే నిర్వహించి జనాభా గణనచేయాలన్నారు.మొదటి దశలో నిర్వహించే ఇళ్ల జాబితా , గృహాల గణనలో ఇంటి నిర్మాణానికి ఉపయోగించిన పదార్థాలు , ఇంటి పరిస్థితి , కుటుంబ యజమాని వివరాలు , తాగునీటి సౌకర్యం , మురుగు నీటి పారుదల వ్యవస్థ , మరుగుదొడ్ల లభ్యత , వంట గది సౌకర్యం వంటి వివరాలతో పాటు రేడియో , టెలివిజన్ , స్మార్ట్‌ఫోన్ , కంప్యూటర్ , సైకిల్ , కారు లాంటి గృహ సౌకర్యాలకు సంబంధించిన మొత్తం 34 ప్రశ్నలకు సంబంధించిన వివరాలను ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి సేకరిస్తారని వివరించారు. మూడు రోజులలో నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని , ప్రతి అంశాన్ని నేర్చుకుంటూ ఏమైనా అనుమానాలు ఉన్నట్లయితే వెంటనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జయమ్మ ఆర్డీవోలు కృష్ణా రెడ్డి , శేఖర్ రెడ్డి , జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి మరియు జిల్లా సెన్సెస్ అధికారి వెంకటరమణ , మున్సిపల్ కమీషనర్ లు , జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి , ఎంపిడిఓలు , తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ బీమా చెక్కును అందచేసిన ఎస్ ఐ చైతన్య కుమార్ రెడ్డి




**చేగుంట మార్చ్ 15,( మన వార్త ప్రతినిధి)**చేగుంట మండలం అనంతసాగర్ గ్రామంలో ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్ గా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు, మెండ స్వామి (40) శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ భీమా పాలసీ తీసుకున్నారు, తీసుకున్న 6 నెలలకు ఆరోగ్యం బాగాలేక మరణించాడు ,కంపెనీ నుండి 5,41,000 రూపాయిల బీమా చెక్కును . నామిని అయిన తన భార్య మెండే రాని, కి ఆదివారం 5లక్షల 41వేలు రూపాయలు చెక్కును చేగుంట ఎస్ ఐ చైతన్య కుమార్ రెడ్డి, సర్పంచ్ శ్రీధర్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఇన్సూరెన్స్ కలిగి ఉండడం తమ బాధ్యతగా భావించి, సరైన బీమా కలిగి ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ స్వామి, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ బ్రాంచ్ మేనేజర్ రవి, డీజీఎం సురేష్ , ఆర్ ఎం శ్రీనివాస్, డివో నరసింహులు, ఏజెంటు కోటగిరి ప్రశాంత్, బ్రాంచ్ ఉద్యోగులు, పంచాయతీ పాలక సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదర సోదరి మణులకు రంజాన్ తోఫా కిట్లు పంపిణీ...

**-అందజేసిన ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య...**

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 15** పవిత్ర రంజాన్ మాసాన్ని



పురస్కరించుకుని యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బీర్ల ఆయిలయ్య ఆదివారం రోజు ముస్లిం సోదరులకు రంజన్ తోఫా కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం శాంతి , సౌభ్రాతృత్వం , సేవా భావానికి ప్రతీక అని తెలిపారు. పేద కుటుంబాలకు ఉపవాస దినాల్లో ఉపయోగ పడే విధంగా ప్రభుత్వం మరియు నాయకులు ఇలాంటి సహాయ కార్యక్రమాలు చేపట్టడం ఆనందంగా ఉ ందని అన్నారు.ప్రతి వర్గం ప్రజలు సంతోషంగా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ముస్లిం సోదరులు ఉపవాసాలు విజయవంతంగా పూర్తి చేసుకొని ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

## పారిశుధ్య కార్మికులను సన్మానించిన సర్పంచులు...



**చిన్న శంకరంపేట మార్చి 15 ( మన వార్త ప్రతినిధి )** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా చిన్న శంకరంపేట మండలం లోని చిన్న శంకరంపేట, చందాపూర్, చందంపేట, కామారం తాండ, తోపాడు వివిధ గ్రామాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నేడు స్థానిక సర్పంచ్ లు చంద్రశేఖర్, కృష్ణ గౌడ్, ప్రవీణ్ కుమార్, మోహన్ నాయక్ ల ఆధ్వర్యంలో సఫాయి కార్మికులను శాలువాలతో ఘనంగా సన్మానించారు, అనంతరం వారికి పిపిఈ కిట్లు, యూనిఫామ్, గ్లౌజ్ లు, సబ్బులు కొబ్బరి నూనె వారికి అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మోహన్ నాయక్ మాట్లాడుతూ సపాయి కార్మికులు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపడితేనే గ్రామాలు పరిశుభ్రంగా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తేనే ప్రజలంతా బాగుంటారని ఆయన తెలిపారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సపాయి కార్మికులను సన్మానించుకోవడం హర్షించదగ్గ విషయమని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ల తోపాటు పంచాయతీ కార్యదర్శులు పాలకవర్గ సభ్యులు సఫాయి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# పలు గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశలు...



**-పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఆయిలయ్య...**

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 15** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని గంధమల్ల గ్రామంలో నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే లబ్ధిదారులకు పట్టు వస్త్రాలు అందజేసి పొట్టేలను బహుమతిగా ఇచ్చి ఆశీర్వదించారు. కొత్త ఇంటిలో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. అలాగే కొండాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులను అభి నందించారు. ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు కట్టుబడి ఉందని తెలిపారు.తదుపరి వాసాలమర్రి గ్రామంలో జరిగిన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధి దారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారికి పట్టు వస్త్రాలు అందజేయడం జరిగింది. మాదాపూర్ , రుస్తాపూర్ , పల్లె పహాడ్ గ్రామంలో కూడా నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధి దారులను అభినందించారు. లబ్ధిదారులకు పట్టు వస్త్రాలు అందజేయగా వారు ఆనందాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల ఆయిలయ్య మాట్లాడుతూ పేదలకు స్వంత ఇల్లు కల్పించడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో పేద ప్రజల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రతి అర్హులైన కుటుంబానికి ఇల్లు అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తుర్కపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు లబ్ధిదారులు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సఫాయి కార్మికులే గ్రామ ఆరోగ్య ప్రదాతలు...



**-సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్...**

**చేగుంట మార్చి 15 ( మన వార్త ప్రతినిధి)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా చేగుంట మేజర్ గ్రామపంచాయతీలో పారిశుద్ధ కార్మికులను స్థానిక సర్పంచ్ సంద్రుకు స్రవంతి సతీష్, ఎంపీడీవో చిన్నారెడ్డి ల చేతుల మీదుగా శాలువాలతో ఘనంగా సన్మానించారు అనంతరం వారికి పిపిఈ కిట్లు, గ్లౌజులు, యూనిఫామ్ లను అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు అంకితభావంతో పని చేస్తేనే గ్రామం ఆరోగ్యవంతంగా ఉంటుందని వారు కొనియాడారు, పారిశుద్ధ కార్మికులు వారి ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా గ్రామ ప్రజల ఆరోగ్యం ముఖ్యం అనే విధంగా పనిచేస్తున్నారని పారిశుద్ధ కార్మికులు బాగుంటేనే గ్రామం ఆరోగ్యవంతంగా ఉంటుందని వారిని సన్మానించుకోవడం చాలా సంతోషంగా ఉందని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిన్నారెడ్డి, స్థానిక సర్పంచ్ స్రవంతి సతీష్ తోపాటు పంచాయతీ పాలకవర్గ సభ్యులు కార్మికులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు ఉచిత వస్త్రాలు పంపిణి...



**-లంక కొండయ్య సేవ ఫౌండేషన్...**

**మధిర, మార్చి15( మన వార్త ) :** మధిర స్థానిక అజాద్ రోడ్ లో ప్రముఖ సంఘ సేవకులు లంకా కొండయ్య నిర్వహిస్తున్న మహాత్మాగాంధీ ఉచిత పాత బట్టల కేంద్రం ద్వారా వివిధ ప్రాంతాల పేద ప్రజలకు, వికలాంగులకు మధిర పట్టణం చుట్టూ ప్రక్కల ప్రాంతాల దయార్ద్ర హృదయులు ద్వారా సేకరించిన వస్త్రాలు నూ ఎ కుటుంబ పేద రికం లో వుంది తెలుసు కొని కొండ య్య వారి గృహానికి వెళ్లి ఉచితం గా ఇచ్చి రావటం మరియు కొండ య్య గృహ శీ వద్ద కు వచ్చిన వివిధ వర్గాలా ప్రజలు కు వారికి నచ్చిన వస్త్రాలు ఉచితంగా ప్రతి ఆదివారం పంచి పెట్టటం ఆనవాయితీ గా పెట్టుకొని ఈ కార్యక్రమం నిర్వహించటం జరుగుతుంది.ఈ కార్యక్రమంనకు కొండయ్య చేస్తున్న కృషిని గుర్తించి నీ సేవా -మా సహాయం అంటూ కొంతమంది దాతలు వారే కొండయ్య గృహానికి వెళ్లి స్వచందంగా వస్త్రాలు వారి ఇంటిలో అదనపు దుస్తులు కొండయ్య గృహనికి పంపిస్తున్నారు. కొంతమంది దాతలు కొండయ్యకు ఫోన్ చేసి వారి గృహంలో పాత వస్తువులు బట్టలు, వంట పాత్రలు దానం చేయటం అభినందనీయం.ఇలా ప్రతి ఒక్కరు ఎదుటి మనిషికి తమ వంతుగా సహాయపడటం మానవ ధర్మంగా భావించి ఇలాంటి సమాజహిత కార్యక్రమంలో పాల్గొని ఆ భగవంతునీ కృపా కు పాత్రులు అవ్వాలి అని కొండయ్య సమాజ ప్రజలకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో లంకా సేవా ఫౌండేషన్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## ప్రగతి ప్రణాళికలో భాగంగా పారిశుద్ధ్యకార్మికులకు ఘనమైన సన్మానం




**-గ్రామసర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి...**

**కల్వకుర్తి మార్చ్ 15 మనవార్త ప్రతినిధి** తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలోతెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామంలోపారిశుద్ధ్యకార్మికులను ఘనంగా సన్మానించిన సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి ఈ సందర్భంగాగ్రామంలోనిపారిశుద్ధ్యకార్మికులకు రక్షణగా ఉపయోగపడే శానిటైజర్ కిట్స్,గ్లౌజ్ లు,షూజులు,మాస్కులు,సబ్బులు,తదితర అవసరమైన వస్తువులను అందించినారు.ఈ సందర్భంగా సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ పడకల్ గ్రామ పరిశుభ్రతను కాపాడుతూ ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న పారిశు ద్ధ్యకార్మికుల సేవలను గుర్తిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించమని, తెలిపారు గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్యకార్మికుల సేవలు మరువలేవని,ప్రతిరోజూ గ్రామంలో ఉన్న వీధులను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూ సమాజసేవలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారని అన్నారు,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన-ప్రగతికి ప్రణాళిక కార్యక్రమాలు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాఘవేందర్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వెల్దండ ప్రజల కోసం ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు




**-సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్....**

**కల్వకుర్తి.మార్చి15 మన వార్త ప్రతినిధి.**కల్వకుర్తి నియోజకవర్గం వెల్దండ మండల కేంద్రంలో బస్టాండ్ ఆవరణలో ఆదివారం వెల్దండ గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. మండల కేంద్రానికి వివిధ గ్రామాల నుండి వందల సంఖ్యలో ప్రయాణికులు వస్తుంటారని, వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు చేశామని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి,నాగర్ కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బచ్చు రామకృష్ణ,ఉప సర్పంచ్ బసన్మోని శీను, పంచాయతీ కార్యదర్శి గిరి గౌడ్,వార్డ్ మెంబర్లు గోసుల కొండయ్య,గుద్దటి కిష్టల్ ముదిగొండ కవిత రమేష్, పిల్లి దేవేందర్, రేవెల్లి మానస రాజు, సిరసనగండ్ల శేఖర్, వాణి పురుషోత్తమ చారి,రంగనాథం మల్లీశ్వరి, మారేపల్లి శ్రీను,మసిగుండ్ల వెంకటేష్ ,గ్రామస్తులుకొయ్యల పుల్లయ్య, క్యాషరప్ వెంకటయ్య,బయ్యమల్లయ్య , మట్ట నిరంజన్ గౌడ్ మట్ట శేఖర్ గౌడ్, మట్ట భరత్ గౌడ్ ,ఈదులపల్లి శ్రీను ,ఎండి బాబా తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ నిర్మాణానికి రెండు లక్షల విరాళం



**పెబ్బేరు.మార్చి15 (మన వార్తప్రతినిధి)** పెబ్బేరు మండలం తోమాలపల్లి ఆంజనేయ స్వామి దేవాలయ అభివృద్ధికి ఎమ్మెల్యే తన ఉదారతను చాటుకున్నారు.ఆలయ పునర్నిర్మాణ పనుల కోసం తన వ్యక్తిగత నిధుల నుంచి రూ.2 లక్షల నగదును ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.ఎమ్మెల్యే స్పందించి పెద్ద మొత్తంలో విరాళం అందజేయడంపై ఎమ్మెల్యేకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జి అశోక్ కుమార్ సర్పంచ్ మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్ మార్కెట్ డైరెక్టర్ రామన్ గౌడ్ గ్రామ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రంగన్న యాదవ్ గ్రామ ప్రజలు ఆలయ మండలి హర్షం వ్యక్తం చేశారు

# తాడికల్ యూత్ ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్



**శంకరపట్నం:మార్చి15(మనవార్త ప్రతినిధి)**శంకరపట్నం మండలం తాడికల్ గ్రామంలో ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ యూత్ క్రికెటర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ క్రికెట్ మ్యాచ్ లో తాడికల్ గ్రామ యూత్ క్రీడాకారులు పాల్గొని ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,,ఈ క్రికెట్ మ్యాచ్ ద్వారా సోదరా భావంతో పాటు స్నేహ సంబంధాలు మెరుగుపడతాయని యూత్ క్రీడాకారులు అన్నారు. ఈ సందర్భంగా గెలుపొందిన క్రీడాకారులకు స్పాన్సర్ ద్వారా ట్రోఫీ తో పాటు ప్రథమ,ద్వితీయ బహుమతులు స్పాన్సర్స్ మొలుగూరి శ్రీనివాస్,మేకల శ్రీకాంత్,భూతాల సంపత్,జోడు సతీష్,అందజేశారు.

# కోటి తలంబ్రాల దీక్ష కరపత్రాలు ఆవిష్కరించిన

**భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు**

**రాయపోల్ మార్చి 15 (మన వార్త):**భద్రాచల సీతారాముల కళ్యాణంలో గోటి తలంబ్రాలే వాడతారు. ఈ తలంబ్రాల దీక్ష కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా రాయిపోల్ మండల్ రాంసాగర్ గ్రామంలో రామాలయ కమిటీ ఆధ్వర్యంలో 16-3-2026 రోజు సోమవారం నాడు 108 కలశాలతో కోటి తలంబ్రాల దీక్ష కార్యక్రమం ఉంటుందని దీనికి సంబందించిన కరపత్రాలను ఆవిష్కరించారు భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత, శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇతర గ్రామాల భక్తులు కూడా ఈ కార్యక్రమంలో ఓల్గొన వచ్చున్నారు. గోటి తలంబ్రాల కార్యక్రమంలో స్త్రీ, పురుష లింగ భేదం లేకుండ అందరు పాల్గొనాలన్నారు. మనం లేకున్నా మనం ఓలిచే తలంబ్రాలు కళ్యాణంలో ఉంటే బహు పుణ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో రామాలయం కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



# ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక

**-పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ మాధురి...**

**బెజ్జంకి, మార్చి 15(మన వార్త ప్రతినిధి )**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా చేపట్టిన 99రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సిద్దిపేట జిల్లా బెజ్జంకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బెజ్జంకి మండల వైద్యాధికారి డాక్టర్ మాధురి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య సంరక్షనలో భాగంగా ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉండటంలో పారిశుద్ధ్య కార్మికులదనీ కృషి గొప్పదని, పారిశుధ్య కార్మికులు వారి వ్యక్తిగత పరిశుభ్రతపై కుడా దృష్టి పెట్టాలాని వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ సులోచన, స్టాఫ్ నర్స్ లక్ష్మి, ల్యాబ్ టెక్నిక్షన్ గోపాల్ రెడ్డి, ఏఎన్ ఎం అనిత,వాణి, సరోజ తదితరులు పాల్గొన్నారు.



## పేదల ఆకలి తీర్చడం ఆనందదాయకం:జూలూరు రమేష్ బాబు





**కల్వకుర్తి మార్చ్ 15 మనవార్త ప్రతినిధి** కల్వకుర్తి పట్టణంలో శనివారం లయన్స్ క్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా 300 మంది ప్రయాణికులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికిముఖ్యఅతిథిగా హాజరైన ఆయన కార్యక్రమాన్ని ప్రారంభించారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ద్వారా చేపడుతున్న సామాజికసేవలుసమాజంలోని అన్ని వర్గాలకు సహాయ సహకారాలుఅందిస్తున్నాయన్నారు. ప్రధానంగా ఆకలి తీర్చే కార్యక్రమం పెద్ద ఎత్తునచేపడుతున్నామన్నారు. ప్రతి ఒక్కరు తమ వంతు సేవ పదిమందికి అందించేందుకు ముందుకు రావాలనిఅందుకు లయన్స్ క్లబ్ ను వేదిక చేసుకోవాలని జూలూరు రమేష్ బాబు కోరారు. క్లబ్ అధ్యక్షుడు చిగుళ్లపల్లి శ్రీధర్ మాట్లాడుతూ రమేష్ బాబు దంపతుల వివాహ వార్షికోత్సవ సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటుచేయడం జరిగింది అన్నారు. బస్టాండ్ లో ఉన్న పారిశుద్ధ్య కార్మికులకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కల్మచర్ల గోపాల్, చార్టర్ ప్రెసిడెంట్ కల్మిచర్ల రమేష్,గుబ్బ కిషన్, బీచాని బాలకృష్ణ,జూలూరు ప్రకాష్, దార మౌని గణేష్, గోవిందు శ్రీనివాస్, కంది ప్రవీణ్, శివ జగదీశ్వర్ వాసవి క్లబ్ అధ్యక్షుడు బాదం హరీష్, గుగ్గిళ్ళ శంకర్, మాచిపెద్ది రవి తదితరులతో పాటు పలువురు పాల్గొన్నారు.

## రజక సంఘం ఆధ్వర్యంలో ఉప సర్పంచ్,వార్డు సభ్యురాలు దంపతులకు సన్మానం



**శంకరపట్నం:మార్చి15(మనవార్త ప్రతినిధి)** శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామంలో శ్రీ మడెళేశ్వర రజక సంఘం ఆధ్వర్యంలో ఇటీవల గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన గ్రామ ఉప సర్పంచ్ దండు రాజేష్,మరియు వార్డు సభ్యురాలు నేరెళ్ల కోమలత-సంతోష్ దంపతులను ఆదివారం రజక సంఘం ఆధ్వర్యంలో పుష్పగుచ్చాలు అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. సంఘ అభివృద్ధి,సామాజిక సంక్షేమం దిశగా కలిసికట్టుగా పనిచేయాలని సంఘం పెద్దలు సూచించారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నియోజకవర్గ ఇన్చార్జి నాంపెల్లి శంకరయ్య,రజక సంఘం అధ్యక్షులు నాంపెల్లి రాజేందర్,మాజీ సర్పంచ్ దండు సాయిలు,నాయకులు దండు కొమురయ్య,నాంపెల్లి వీరమల్లు,దండు అరుణ్,దండు చిరు సాయి,నేరెళ్ల సదయ్య,దండు సాయిలు అటెండర్,తాడిచెర్ల లక్ష్మీపతి,దండు రాకేష్,దండు స్వరూప,తడిగొప్పుల రాధ,తదితరులు పాల్గొన్నారు.

# రుద్ర హాస్పిటల్‌ను ప్రారంభించిన ప్రభుత్వ విప్...



**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 15** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రంలో నూతన హంగులతో సరికొత్త పరికరాలతో ఏర్పాటు చేసిన రుద్ర హాస్పిటల్‌ను ఆదివారం రోజు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ , ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఆయిలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల ఆయిలయ్య రిబ్బన్ కట్ చేసి ఆసుపత్రిని ప్రారంభించి , ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సేవలను , సదు పాయాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు సమీపంలోనే నాణ్యమైన వైద్య సేవలు అందించడం ఎంతో అవసరమని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలు చిన్న చిన్న వ్యాధులకే దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని , ఇప్పుడు తుర్కపల్లి పట్టణంలోనే ఆధునిక వైద్య సదు పాయాలతో హాస్పిటల్ ఏర్పాటు కావడం ఆనంద దాయకమని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యతగా ఉందని , రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేయడానికి పలు చర్యలు చేపడుతోందని ఆయన తెలిపారు. పేద , మధ్య తరగతి ప్రజలకు అందు బాటులో ఉండే విధంగా మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి యాజమాన్యానికి సూచించారు. ఈ కార్యక్రమంలో తుర్కపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు ప్రైవేటు ఆసుపత్రుల డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# 200 ల దేశాల్లో లయన్స్ క్లబ్ విస్తృత సేవలు




**గజ్వేల్ మార్చ్ 15 మన వార్త ప్రతినిధి** ప్రపంచంలోనే అతిపెద్ద సేవా సంస్థగా, 200 లకు పైగా దేశాల్లో లయన్స్ క్లబ్ విస్తృత సేవలు అందిస్తున్నట్లు ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ డైరెక్టర్ లయన్ బాబురావు స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో ఆదివారం జరిగిన సుమాంజలి రీజియన్ కాన్ఫరెన్స్ కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మెదక్ ఎంపీ రఘునందన్ రావు, రీజియన్ చైర్మన్ సంజయ్ గుప్త, రీజియన్ మహిళా విభాగం అధ్యక్షులు సుమలత గుప్తలతో కలిసి ఆయన మాట్లాడారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో లయన్స్ క్లబ్ సేవలు నేరుగా అందిస్తుండగా, రీజియన్ స్థాయిలో గజ్వేల్ లయన్స్ క్లబ్ అగ్రగామిగా నిలిచినట్లు తెలిపారు. క్షయ వ్యాధి నివారణ, ఎయిడ్స్, ఆరోగ్యం, క్యాన్సర్ పై అవగాహన, విద్య, క్రీడలు, ఆకలి నిర్మూలన, పర్యావరణం, కాలుష్య నియంత్రణ, మొక్కలు నాటడం, అనాధ ఆశ్రమాల నిర్వహణ, అవయవ సేకరణ, వివిధ విపత్తులు వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ పేద ప్రజలకు లయన్స్ క్లబ్ చేరువైనట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రాణాలు కోల్పోయిన వివిధ వర్గాల నుండి అవయవాలు సేకరించి ప్రాణాలు పోస్తుండగా, గజ్వేల్ కు చెందిన లయన్ నంగునూరి సత్యనారాయణ గుప్త కృషితో వందకు పైగా ఐ బాల్స్ సేకరించి ఇతరులకు చూపును ప్రసాదించినట్లు స్పష్టం చేశారు. ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు పంపిణీ చేస్తుండగా, అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. రోజురోజుకు పెరిగిపోతున్న క్షయవ్యాధి, ఎయిడ్స్ వంటి ప్రాణాంతక వ్యాధులపై చైతన్యం చేస్తూ సామాజిక సేవే లక్ష్యంగా లయన్స్ క్లబ్ ప్రపంచవ్యాప్తంగా 15 లక్షల మంది సభ్యులతో ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. గజ్వేల్ ప్రాంతంలో లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తృతం చేస్తుండగా, ఎంపీ రఘునందన్ రావు సహకారంతో స్థలం అందజేస్తే ఆసుపత్రి నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కాగా లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలకు తన వంతు సంపూర్ణ సహకారం ఉంటుందని ఎంపీ రఘునందన్ రావు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి రీజియన్ చైర్మన్ సంజయ్ గుప్త అధ్యక్షత వహించగా, జాతీయ స్థాయి లయన్స్ అమర్నాథ్, ప్రకాష్ రావు, విజయలక్ష్మి, నర్సింహ రాజు, సూర్యారావు, పూర్వ అధ్యక్షులు ఉప్పల మెట్టయ్య గుప్త, పరమేశ్వర చారి, దుర్గాప్రసాద్, సత్యనారాయణ, నేతి శ్రీనివాస్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

## కొండూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశం ఘనంగా నిర్వహణ



**నిజామాబాద్ జిల్లా సిరికొండ (మన వార్త)మార్చ్ 15**సిరికొండ మండలం కొండూరు గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేయడం జరిగినది ఇందులో మన మండల అధ్యక్షులు బాకరం రవి, ఎర్రన్న,సంతోష్, గ్రామ నాయకులు, సల్ల రాజారెడ్డి , చెల్లెం గంగాధర్ సొసైటీ చైర్మన్, కొండూరు గ్రామ సర్పంచ్ నర్మల లతా భాస్కర్ రెడ్డి , సదానంద్, నవీన్, ప్రవీణ్,డాక్టర్ వీరశేఖర్, ఉపసర్పంచ్ వడ్ల గాయత్రి లక్ష్మణ్, మగ్గిడి లక్ష్మణ్, మరియు వార్డు నంబర్స్ పాల్గొనడం జరిగింది.

# అర్హులైన ప్రతి పేదకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు



**-రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమం నిరంతర ప్రక్రియ...**
**-గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి...**

**గజ్వేల్ మార్చ్ 15 మన వార్త ప్రతినిధి** అర్హులైన ప్రతి పేదకు కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు వర్తింపజేస్తుండగా, రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమం నిరంతర ప్రక్రియని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని క్యాసారంలో ఇందిరమ్మ గృహాన్ని లబ్ధిదారులతో కలిసి ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరీ చేస్తుండగా, ఆరు గ్యారెంటీలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ అవసరాలకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ సరఫరా, రూ 500 కే వంట గ్యాస్ సిలిండర్ పంపిణీ, రేషన్ కార్డు మంజూరితో పాటు సన్న బియ్యం అందజేత తదితర పథకాలు వర్తింపజేస్తున్నట్లు గుర్తు చేశారు. ముఖ్యంగా గజ్వేల్ నియోజకవర్గానికి 35 వేల ఇండ్లను మంజూరు చేయగా, అందులో 80 శాతం మంది లబ్ధిదారుల ఇంటి నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నట్లు తెలిపారు. లబ్ధిదారుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని బిల్లులు చెల్లిస్తుండగా, ఇందులో ఎలాంటి మధ్య దళారీలు ఉండరని చెప్పారు. సొంత స్థలం ఉన్న పేదలు నేరుగా సంప్రదిస్తే ఇందిరమ్మ ఇల్లు మంజూరి చేస్తామని పేర్కొన్నారు. రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రూ 2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా, సన్నధాన్యానికి రూ 500 బోనస్, పేదలకు రూ. 10 లక్షల ఆరోగ్యశ్రీ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ తదితర సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. స్థానిక సమస్యలను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధికి పెద్దపీట వేస్తుండగా, అన్ని పంచాయతీలకు ప్రభుత్వం నిధులు మంజూరీ చేసిందని వివరించారు. ఈ కార్యక్రమంలో నేతలు నాయిని యాదగిరి, కొండల్ రెడ్డి, మహేష్, గుంటుకు శ్రీనివాస్, నక్క రాములు గౌడ్, నేత నాగరాజు, అభిషేక్ రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

# కూతురు, కుమారుడి పై తల్లి కత్తితో దాడి...



**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 15** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం తుక్కాపురం గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున దారుణ ఘటన చోటు చేసుకుంది. మానసిక సమస్యల నేపథ్యంలో ఓ వివాహిత తన కూతురిని గొంతు కోసి హత్య చేయగా , కొడుకును కూడా హత్య చేయడానికి యత్నించిన ఘటన కలకలం రేపింది. భువనగిరి రూరల్ పోలీసులు , స్థానికుల సమాచారం ప్రకారం బీబీనగర్ మండలం జైనెపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బేజంకి నరేందర్ రెడ్డి భార్య బేజంకి నీలిమ (40) శని వారం సాయంత్రం జైనెపల్లి నుంచి తుక్కాపురం గ్రామంలోని తన అమ్మవారి ఇంటికి రావడం జరిగింది. ఆదివారం ఉదయం తెల్ల వారుజామున నీలిమ తన కుమార్తె బేజంకి కృతిక రెడ్డి (14) , ఎనిమిదో తరగతి చదువుతున్న బాలిక గొంతు కోసి హత్య చేసింది.. అనంతరం తన కుమారుడు అక్షిత్ రెడ్డి (11) ఆరో తరగతి విద్యార్థి గొంతు కోయడానికి కూడా ప్రయత్నించగా బాలుడు తప్పించుకుని కేకలు వేయడంతో గ్రామస్తులు అక్కడికి చేరుకున్నారు. గ్రామస్తులు చేరుకునేలోపే నీలిమ ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే అక్కడికి చేరుకున్న స్థానికులు చుట్టుపక్కల వాళ్ళు తీవ్రంగా గాయపడిన బాలుడు అంశత్ రెడ్డిని , ఉరి వేసుకొవడానికి ప్రయత్నించిన తల్లి నీలిమను వెంటనే ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న భువనగిరి రూరల్ ఎస్ఐ మిర్యాల అనిల్ ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నీలిమ మతి స్థిమితం కోల్పోయి అప్పుడప్పుడు మతి స్థిమితం లేని వ్యక్తిగా వ్యవహరిస్తుందని అదే క్రమంలో ఇద్దరు బిడ్డల్ని చంపే ప్రయత్నం చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగ కూతురు కృతిక రెడ్డి అక్కడిక్కడే మరణించగా కుమారుడు అక్షిత్ రెడ్డి , తల్లి నీలిమ హైదరాబాద్ లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

## ముస్తాబాద్ లో కుళ్ళిపోయిన తలకాయ మాంసం విక్రయాలు..




**రాజన్న సిరిసిల్ల ఆర్ సి ఇన్చార్జ్ మన వార్త మార్చ్ 15** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలోని రహదారిపై ఉండే మటన్ షాప్ లో కుళ్ళిపోయిన మాంసాలు తలకాయలు విక్రయిస్తున్నారు అని దుబ్బాక వాస్తువులు రెడ్డి బోయిన శ్రీహరి బాధితుడు తెలిపాడు. మంచి తలకాయ అని చెప్పి బాధితునికి ఇవ్వగా అతని దగ్గర నుండి 1500 రూపాయలు వసూలు చేశాడని తెలిపాడు. ఇంటికి వెళ్లేసరికి పూర్తిగా కుళ్ళిపోయిన వాసన వచ్చిందని బాధితుడు వాపోయాడు, తిరిగి వచ్చి వాదించగా ఇలా మండల కేంద్రంలో మూడు నుంచి నాలుగు రోజుల మాంసాన్ని విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో ఆడుతున్నారని ప్రజలు తీరా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని కుళ్ళిపోయిన మాంసం విగ్రహం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు...

## పోచమ్మ అమ్మ వారి ఆలయ నిర్మాణ భూమి పూజలో పాల్గొన్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

**కల్వకుర్తి మార్చ్ 15 మన వార్త ప్రతినిధి** మాడుగుల పట్టణకేంద్రంలో పోచమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణానికి నిర్వహించిన భూమి పూజా కార్యక్రమంలో పాల్గొన్నఐక్యత ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర



నాయకులు & టాస్క్ సి. ఓ. ఓ. సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ నిర్మాణ పనులు విజయవంతంగా పూర్తవ్వాలనికోరుకున్నారు,ఆలయాలు ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తాయి,గ్రామాల్లో ఐక్యతను పెంపొందించే కేంద్రాలుగా నిలుస్తాయని తెలిపారు,దేవాలయ నిర్మాణం ద్వారా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం మరింత బలపడటంతోపాటుగ్రామాభివృద్ధికికూడాదోహదపడుతుందని పేర్కొన్నారు,ఆలయాల అభివృద్ధికి తనవంతు సహాయసహకారాలు తప్పకుండా ఉంటాయని తెలియజేశారు. ఈకార్యక్రమంలోఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు చిక్కుడురాములు,జంగయ్య,చెన్నయ్య,మధు,లచ్చలయ్య,మాదెల యాదయ్య,మాదెల గణేష్ లతో పాటు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు సూదిని జైపాల్ రెడ్డి లతో పాటు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్రసోషల్ మీడియా ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా షేక్ అమీర్



**శంకరపట్నం:మార్చి15(మనవార్త ప్రతినిధి)**శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామానికి చెందిన షేక్ అమీర్ తెలంగాణ రాష్ట్ర సోషల్ మీడియా ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా నియామకమయ్యారు. ఏఐసీసీ సోషల్ మీడియా చైర్మన్ పంజాబ్ రాష్ట్ర బోలాత్ నియోజకవర్గ ఎమ్మెల్యే సుఖపాల్ సింగ్ ఖైరా ఈ నియామకాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా అమీర్ మాట్లాడుతూ,,తన పదవికి సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్,రాష్ట్ర బీసీ రవాణా,సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ,టీపీసీసీ సభ్యులు,మాజీ జెడ్పిటిసి బత్తిని శ్రీనివాస్ గౌడ్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోపగోని బస్వయ్య గౌడ్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.


## ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కల నెరవేరుతుంది




**– ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశంలో టీపీసీసీ సభ్యులు:బత్తిని శ్రీనివాస్ గౌడ్...**

**శంకరపట్నం:మార్చి15(మనవార్త ప్రతినిధి)**ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కల నెరవేరుతుందని టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శంకరపట్నం మండలం ఆముదాలపెల్లి గ్రామానికి చెందిన రాదారపు ఓంకార్,మెట్పల్లి గ్రామానికి చెందిన అడప మౌనిక, కొండపాక మమత ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద రూ. 5 లక్షల ఆర్థిక సాయంతో తమ ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నారు. ఆ నివాసాలకు ఆదివారం కొత్త ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ గౌడ్ హాజరై ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,,ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కల నెరవేడుతోందని, పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం,పేదల ముఖంలో చిరునవ్వు చూడటమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. గత పాలకులు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు అని చెప్పి పేదలకు ఒక ఇల్లు కూడా మంజూరు చేయకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. కానీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు నిజమైన న్యాయం జరుగుతోందని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలలను సహకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రానున్న రోజుల్లో మరింత మంది పేదలకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపగోని బస్వయ్య గౌడ్,ఉప సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షుడు గొట్టే మధు,ఆముదాలపల్లి ఉప సర్పంచ్ దొంగల రమేష్,మాజీ ఉపసర్పంచ్ కన్నబోయిన జంపయ్య, ఆముదాలపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు అమ్ముల ఓదెలు,వార్డు సభ్యులు,ఇందిరమ్మ కమిటీ సభ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏలాంటి అనుమతి లేకుండా యతేచ్చగా మట్టి అక్రమ రవాణా





**–సెలవు దినాలు శని, ఆదివారం లక్ష్యం...**

**బెజ్జంకి,మార్చి 15(మన వార్త ప్రతినిధి )**అనుమతి లేవు.. అడిగే వారు లేరు.. ఇంకేముంది....లక్షలు విలువచేసే మట్టిని యతెచ్చగా తవ్వి తరలించేస్తున్నారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని ఆయా గ్రామాల్లో కొందరూ అక్రమమార్కులు తమ ఇస్టాను సారాం అక్రమంగా గుట్ట మట్టి తవ్వేస్తున్నారు. బెజ్జంకి మండల కేంద్రానికి కూత వేటు దూరంలోనే జరుగుతున్న అధికారులు మాత్రం, పట్టించుకోవడం లేదని వాళ్లకు సహకరిస్తున్నారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గుండారం గ్రామం నుండి ప్రభుత్వ స్థలంలోని గుట్టనుండి జేసిబి ద్వారా టిప్పర్ లో లోడ్ చెసి తరలించేస్తున్నారు. ఇంత జరుగుతున్న అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరి జీవితంతో మాఫియా ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని ఆయా గ్రామాల ప్రజలు నుండి విమర్శలు వెలువెత్తుతున్నాయి. బెజ్జంకి తహసీల్దార్ వివరణ బెజ్జంకి తహసీల్దార్ కల్యాణపు శ్రీకాంత్ నీ వివరణ కోరగా ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, మాకు ఇచ్చే అధికారాలు కూడా లేవని తహసిల్దార్ తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి మాఫియా ఆగడాలని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బిజెపి పార్టీ సీనియర్ నాయకులు



**కమలాపూర్ మార్చి 15 మన వార్త ప్రతినిధి** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల పరిధిలోని నేరెళ్ల గ్రామానికి చెందిన బిజెపి పార్టీ సీనియర్ నాయకులు ,తదితరులు, హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ బాబు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు , మరియు హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ బాబు పనితీరు బాగుందని ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే స్పందించి పరిష్కరించడం చూస్తూ ఉంటే ప్రజల సమస్యలపై ఆయనకు ఉన్న అవగాహన పట్ల ఆకర్షితులమయ్యామని నేరెళ్ల గ్రామానికి చెందిన బిజెపి పార్టీ సీనియర్ నాయకులు అల్లాటి రవీందర్ ,నేరెళ్ల గ్రామం మాజీ ఉప సర్పంచ్ తోర్ని చిరంజీవి, ట్రాక్టర్ యూనియన్ మాజీ అధ్యక్షులు ఆకుల రవీందర్, కాంగ్రెస్ పార్టీలో చేరామని పార్టీ బలోపేతానికి ఎల్లవేళలా కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు చిరుత సుధాకర్ పార్టీ సీనియర్ నాయకులు పెరుమాళ్ళ పరుశరాములు, పోతర బోయిన రాజ్ కుమార్, మౌటం కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు

## చొప్పదండి ఎమ్మెల్యేను కలిసిన ఎలక్ట్రానిక్ మీడియా యూనియన్ కార్యవర్గం



**కొడిమ్యాల మార్చి. 15. మన వార్త ప్రతినిధి** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలో నూతనంగా ఏర్పడిన చొప్పదండి నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా యూనియన్ కార్యవర్గ సభ్యులు, యూనియన్ సభ్యులతో కలిసి ఆదివారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు శాలువా కప్పి సత్కరించారు. అనంతరం నూతనంగా ఏర్పడిన ఎలక్ట్రానిక్ మీడియా యూనియన్ కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అభినందించారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే మీడియా ప్రతినిధులు సమాజానికి కీలకమైన సేవ అందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. యూనియన్ కార్యవర్గం ఐక్యంగా పనిచేస్తూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా యూనియన్ అధ్యక్షులు బొక్కెన కృష్ణ కుమార్, గౌరవ అధ్యక్షులు మేడి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి అల్లావుద్దీన్, ఉపాధ్యక్షులు, కోశాధికారి, కార్యవర్గ సభ్యులు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఎంపీ రఘునందన్ రావుకు వినతిపత్రం సమర్పించిన సంపత్ రెడ్డి




**గజ్వేల్ మార్చ్ 15 మన వార్త ప్రతినిధి** సిద్ధిపేట జిల్లా గజ్వేల్ లో ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ రఘునందన్ రావు ను మర్యాదపూర్వకంగా కలిసిన కుకునూరు పల్లి మండల బిజెపి అధ్యక్షులు సంపత్ రెడ్డి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నకిష్టాపూర్ గ్రామం క్రాస్ రోడ్డు వద్ద బస్టాండ్ నిర్మాణం గురించి వినతిపత్రం ఇవ్వడం జరిగింది వారు సానుకూలంగా స్పందించి త్వరలోనే నిధులు మంజూరు చేసి శంకుస్థాపన కార్యక్రమానికి వస్తాను అని హామీ ఇవ్వడం జరిగింది అని అన్నారు ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ చిన్న కిస్టాపూర్ గ్రామ బూత్ అధ్యక్షులు తన్నీరు యాదగిరి, రేడ్డమైన పరుశురాం, సీనియర్ నాయకులు రెడ్డమైన శ్రీనివాస్, సదనంద్ గౌడ్, మలిపెద్ది రమేష్ తదితరులు పాల్గొన్నారు

## టీజేయు గౌరవ అధ్యక్షుల చేతుల మీదుగా ప్రతి ఉదయం క్యాలెండర్ ఆవిష్కరణ



**కమలాపూర్ మార్చి 15 మన వార్త ప్రతినిధి** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో టీజేయు ప్రెస్క్లబ్ కార్యాలయం నందు టీజేయు గౌరవ అధ్యక్షులు మౌటం కుమార్ స్వామి చేతుల మీదుగా ప్రతి ఉదయం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీజేయు గౌరవ అధ్యక్షులు (సీనియర్ కాంగ్రెస్ నాయకులు) మాట్లాడుతూ జర్నలిస్ట్ పాత్ర సమాజంలో చాలా విలువైందని ప్రజలకు ప్రభుత్వానికి మధ్య సారధిగా ఉంటూ ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి చేరవేయడంలో ముఖ్యపాత్ర వహిస్తాడని అలాగే ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కూడా ముందుంటాడని తెలిపారు. సమాజంలో ఎలాంటి జీతభత్యాన్ని ఆశించకుండా ప్రజలకు , ప్రభుత్వానికి , సేవ చేసేవాడే జర్నలిస్ట్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో టిజేయు అధ్యక్షులు పెర్క రామకాంత్, ఉపాధ్యక్షుడు పుల్ల రాజేష్, ప్రధాన కార్యదర్శి పెండెం రాజేంద్రప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు ఎడ్ల నాగరాజు, గౌరవ సలహాదారుడు కోలే దామోదర్ రావు, జిల్లా సహాయ కార్యదర్శి జూపాక విక్రం, జిల్లా ఈసీ నెంబర్ ఎర్రం రమేష్, సంయుక్త కార్యదర్శి పుల్ల సందీప్, సభ్యులు ఎర్రం రంజిత్, డాకూరి రాజశేఖర్ ,కుమ్మరి ప్రకాష్ ,ఎలిమి రాజు ,తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటిని సందర్శించి సరైన సమాచారం నమోదు చేయాలి




**ములుగు మార్చి 15 మనవార్త** దేశ అభివృద్ధిలో, ప్రత్యేక ప్రణాళికలు రచించడంలో, ప్రభుత్వ పథకాలను రూపొందించడంలో జనాభా లెక్కలు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని, 2027 జనాభా లెక్కలు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. ఆదివారం ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో '2027 జనాభా' లెక్కలలో భాగంగా 2026 మే 11వ తేదీ నుండి 2026 జూన్ 9వ తేదీ వరకు జరిగే 'పేజ్ 1 హౌస్ లిస్టింగ్ & హౌసింగ్ సెన్సెస్ ' నిర్వహణపై జిల్లా, మండల, మున్సిపల్ స్థాయి అధికారులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో జనాభా లెక్కలు అత్యంత కీలకపాత్ర పోషిస్తాయని స్పష్టం చేశారు. ఖచ్చితమైన గణాంకాలు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడానికి తోడ్పడతాయన్నారు. జనాభా గణన ప్రాథమిక వనరు అని, హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సెస్ ప్రక్రియలో ఇంటి నిర్మాణం, నివాస పరిస్థితులు, కుటుంబ వివరాలు, మౌలిక సదుపాయాలు వంటి అంశాలను సమగ్రంగా నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు. మొదటి దశలో నిర్వహించబడే ఇళ్ల జాబితా మరియు గృహాల గణనలో ఇంటి నిర్మాణానికి ఉపయోగించిన పదార్థాలు, ఇంటి పరిస్థితి, కుటుంబ యజమాని వివరాలు, త్రాగునీటి సౌకర్యం, మురుగునీటి పారుదల వ్యవస్థ, మరుగుదొడ్ల లభ్యత, వంటగది సౌకర్యం వంటి వివరాలతో పాటు రేడియో, టెలివిజన్, స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్, సైకిల్, కారు వంటి గృహ సౌకర్యాలకు సంబంధించిన మొత్తం 33 ప్రశ్నలకు సంబంధించిన వివరాలను ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి సేకరించే విధానాన్ని ఈ శిక్షణలో వివరించనున్నట్లు తెలిపారు. సమాచార సేకరణలో భాగంగా హెచ్ ఎల్ వో మొబైల్ అప్లికేషన్ పై అధికారులకు సూపర్వైజర్లకు ఎన్యుమరేటర్లకు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, నెట్వర్క్ లేని ప్రాంతాలలో ప్రత్యేక టెక్నికల్ బృందాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి ప్రకాష్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ శాఖల అధికారుల బాధ్యతలను వివరించారు. అన్ని శాఖల సమన్వయంతో జనాభా గణన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజనల్ జిల్లా ఎన్నికల అధికారి, ఆర్డీవో వెంకటేష్, హైదరాబాద్ జన గణన శాఖ గణన అధికారులు హోబాలాల్, సరళ, డిఇఓ సిద్ధార్థ్ రెడ్డి, డిపిఓ వెంకయ్య, అన్ని మండలాల తహసిల్దార్ లు, ఎంపీడీవోలు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయశీబర్స్ మెంట్ బకాయిల కోసం పోరు దీక్ష..



**కరీంనగర్,మార్చి 15( మన వార్త ప్రతినిధి):** విద్యార్థుల ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో హైదారాబాద్ లో చేపట్టిన పోరు దీక్షలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు మరియు జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ముఖ్య అతిథులు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర శాసన మండలి సభ్యులు సిరికొండ మధుసూదనాచారి, ఎల్ రమణ, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మరియు మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ లు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదలలో జాప్యం చేస్తూ వల్ల చదువులు కుంటుపడేల చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ బకాయిలు విడుదల చేయడం అని అనడం బాధ్యత రాహిత్యమని అలాంటప్పుడు గత ప్రభుత్వ పన్నుల బకాయిలను ఎందుకు వాడుకుంటున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అసెంబ్లీ మరియు శాసన మండలిలో బిఆర్ఎస్ తరుపున ఈ ఫీజు బకాయిలపై మాట్లాడుతామని నాయకు తెలిపారు. ఇప్పటికైనా బేషరతుగా విద్యార్థుల బకాయిలు 500 కోట్లు వెంటనే విడుదల చేయాలనిలేని పక్షంలో అసెంబ్లీని ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## అల్ఫోర్స్ లో అంతర్రాష్ట్ర కరాటే చాంపియన్‌షిప్ పోటీలు..



**కరీంనగర్ , మార్చి 15(మన వార్త ప్రతినిధి):**కొత్తపల్లి ప్రాంతంలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాలలో తెలంగాణ అంతర్రాష్ట్ర కరాటే చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి హుజరాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒడితల ప్రణవ్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి, కరాటే ఇన్‌స్పెక్టర్ వసంత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ కరాటే ఆత్మరక్షణకు అత్యంత ఉపయోగకరమైన క్రీడగా ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల కూడా ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. క్రీడలు విద్యార్థులలో క్రమశిక్షణ, ధైర్యం, పోరాట స్ఫూర్తిని పెంపొందిస్తాయని తెలిపారు. జపాన్, చైనా వంటి దేశాల్లో కరాటేకు ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. కరాటే సాధన ద్వారా శారీరక దారుఢ్యంతో పాటు ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత పెరుగుతాయని అన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో విద్యార్థులు క్రమశిక్షణతో ముందుకు సాగుతున్నారని అభినందించారు. డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొనడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ పోటీలలో తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన సుమారు 450 మంది క్రీడాకారులు వివిధ విభాగాల్లో పాల్గొన్నారు. విజేతలకు బంగారు, రజత, కాంస్య పతకాలు ప్రదానం చేశారు. పోటీలకు హాజరైన క్రీడాకారులకు అల్ఫోర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కోచ్‌లు, మేనేజర్లు, న్యాయనిర్ణేతలు పాల్గొన్నారు.

# మాట నిలుపుకున్న కౌన్సిలర్ రాము..



**జమ్మికుంట, మార్చి 15( మన వార్త ప్రతినిధి):**ప్రజలకు ఇచ్చిన మాటను కౌన్సిలర్ నిలబెట్టుకున్నాడు. జమ్మికుంట మున్సిపాలిటీకి 9వ వార్డులో బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ పొనగంటి రాము పురపాలక ఎన్నికల సమయంలో వార్డు ప్రజలకు మాట ఇచ్చిన ప్రకారం వార్డులో ఆడపిల్ల పెండ్లి కి పదివేల రూపాయలు. ఆడపిల్ల పుడితే రూ 5000 రూపాయలు ఫిక్స్ చేసి బాండ్ ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. ఆదివారం 9వ వార్డులో కంది స్వరూప మల్లయ్య కుమార్తె వివాహానికి, వార్డ్ కౌన్సిలర్ పొనగంటి రాము ఆయన సతీమణి పొనగంటి స్వప్న తో సమేతంగా పెళ్లికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి రూ 10116 రూపాయలు అందజేశారు. అనంత కౌన్సిలర్ రాము మాట్లాడుతూ మాట ఇస్తే తప్పను ఇచ్చిన మాట ప్రకారము కట్టుబడి ఉంటాను అని చెప్పారు. వార్డులోని ఇకముందు ఏ ఆడబిడ్డ పెళ్లి అయినా, అమ్మాయి జన్మించిన వార్డులోని ప్రజలకు ఏ ఆపద వచ్చిన వారి వెంటే ఉండి వారి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. వార్డులోని యువకులు, మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న టిప్పర్ ల పై కేసు నమోదు...



**వేములవాడ మార్చి 15 (మన వార్త )**వేములవాడ రూరల్ మండలానికి చెందిన పాత కొడుముంజ గ్రామం నుండి ఎలాంటి అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేయడం జరిగింది అని వేములవాడ రూరల్ ఎస్సై వెంకట్రాజం తెలిపారు. వివరాలలోకి వెళితే పాత కోడి ముంజ గ్రామము నుండి సంబంధిత అధికారుల నుండి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా అట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లు **TS02UA7028** డ్రైవర్ వడ్డె కృష్ణ, ఓనర్ చంద్రంపేట రమేష్, **TS02UC3653** డ్రైవర్ లకావత్ సాయి కుమార్, ఓనర్ లక్ష్మా రెడ్డి ల పై కేసు నమోదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకట్రాజం మాట్లాడుతూ సంబంధిత అధికారుల నుండి అనుమతి తీసుకోకుండా మట్టి గాని ఇసుక గాని అక్రమంగా తరలించినట్టయితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## అబాది జమ్మికుంట ఈద్గా లో అభివృద్ధి పనులు ప్రారంభం..



**జమ్మికుంట, మార్చి 15( మన వార్త ప్రతినిధి):**అబాది జమ్మికుంట ఈద్గా లో అభివ్రుద్ధి పనులను మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) ప్రారంభించారు. జమ్మికుంట మున్సిపల్ 13వ వార్డులో ముస్లిం సోదరులకు రంజన్ పర్వదినం పురస్కరించుకొని నమాజ్ చేసుకోవడం కోసం వెళ్ళే ఈద్గా లో సమస్య వుండడంతో స్థానిక కౌన్సిలర్ తొకలసి చైర్మెన్ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఎన్నికల సమయంలో స్థానిక కౌన్సిలర్ ఎగిత సుజాత అశోక్ ఈద్గా లో నమాజ్ చేసుకోవడం కోసం స్థలంలో మరమ్మతులు చేపిస్తామని ఇచ్చిన హామీని గెలిచిన నెల రోజుల వ్యవధిలోనే పనులు ప్రారంభించిన ఎగిత సుజాత అశోక్ ను చైర్మెన్ అభినందించారు. ఎవరైనా ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇస్తారు కానీ ఎగిత సుజాత అశోక్ హామీలు అమలు చేస్తున్నారు. అందరూ కూడా వీరిని ఆదర్శంగా తీసుకొని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి మన పట్టణాన్ని అభివ్రుద్ధి పథంలో ముందుంచాలని మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) తెలిపారు. ఈ కార్యక్రమములో వార్డు ప్రజలు,ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడలో శివాజీ భవన్ నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**వేములవాడ మార్చి 15 (మన వార్త )**వేములవాడ పట్టణ అభివృద్ధిలో కులమతాలకు అతీతంగా సేవలు అందిస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం వేములవాడ మున్సిపల్ పరిధిలోని అయ్యోరు పల్లి సమీపంలో ఆరే క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో నిర్మించనున్న 'శివాజీ భవన్' నిర్మాణానికి ఆయన భూమి పూజ నిర్వహించి, పనులను ప్రారంభించారు. ఎఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సామాజిక సేవా దృక్పథంతో రాజన్న భక్తులకు నిత్యాన్నదానం ఏర్పాటు చేయాలన్న సంకల్పంతో ఆరే క్షత్రియ సంఘం శివాజీ భవనాన్ని ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమన్నారు. భవన నిర్మాణానికి తమ వంతు పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని ఆయన హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని సుమారు 54 కులాలను గుర్తించి, ప్రతి కుల సంఘ భవనానికి 5 లక్షల రూపాయల వరకు వెచ్చించి ప్రత్యేక కృషి చేస్తున్నామని వెల్లడించారు.ఎకులమతాలకు అతీతంగా పట్టణంలో అభివృద్ధి జరగాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆరే క్షత్రియ కులస్తులు వెంటనే కమిటీని ఏర్పాటు చేసుకుని, వీలైనంత త్వరగా శివాజీ భవనాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరే క్షత్రియ సంఘం ప్రతినిధులు, స్థానిక నాయకులు మరియు భక్తులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్...



**వేములవాడ మార్చి 15 (మన వార్త )**వేములవాడ రూరల్ మండలం బొల్లారం,బలరాజ్ పల్లి, గ్రామాల్లో నిర్వహించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారికి నూతన వస్త్రాలు అందజేశారు..

# బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు..

**-ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు...**

**ఇల్లంతకుంట,మార్చి 15( మన వార్త ప్రతినిధి):**ఇల్లంతకుంట శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఆలయ ప్రాంగణంలో పరిశుభ్రత పనులు చేపడుతున్నట్లు అలాగే ఆలయానికి రంగులు వేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 25 వ తారీకు నుండి ప్రారంభమై ఏప్రిల్ ఆరవ తారీకు ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు సమాప్తం అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో సుధాకర్ ధర్మకర్తలు పరమేష్, కిరణ్, రామ్ రెడ్డి, నారాయణరెడ్డి ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# శ్రవణా నక్షత్రం సందర్భంగా స్వర్ణగిరిలో గిరి ప్రదక్షిణ...




**-ఆలయంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు...**

**-ఘనంగా స్వర్ణగిరిషుని దివ్య విమాన రథోత్సవం...**

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త ప్రతినిధి మార్చి 15** తెలంగాణ ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన యాదాద్రి తిరుమల స్వర్ణగిరి దేవస్థానంలో ఆదివారం రోజు శ్రవణా నక్షత్రం వెంకటేశ్వర స్వామి వారి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకొని ఉదయం 7 గంటల 30 నిమిషాలకు స్వర్ణగిరి క్షేత్రంలోని స్వామివారి పాదాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు , చైర్మన్లు మానేపల్లి మురళీకృష్ణ గోపికృష్ణల ఆదేశాల మేరకు గిరి ప్రదక్షణ యొక్క విశిష్టతను భక్తులకు వివరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి సుమారు 250 మంది భక్తులు పాల్గొని స్వామివారి గోవింద నామాలను స్మరిస్తూ గిరి ప్రదక్షిణ చేశారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించు కుని దివ్యానుభూతిని పొందారు. సాయంత్రం 6:30 నిమిషాలకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దివ్య విమాన రథోత్సవానికి ఆలయ ఈవో అమర్నాథ్ కొబ్బరికాయ కొట్టి రథోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి రథాన్ని లాగి ఆనంద పరవశులయ్యారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు గిరి ప్రదక్షణ చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మంచి నీరు , మజ్జిగను పంపిణీ చేశారు. అలాగే వచ్చేది వేసవికాలం దృశ భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో చలువ పందిర్లను ఏర్పాటు చేశారు.

# చిల్కానగర్‌లో ఏఆర్ కానిస్టేబుల్ దారుణ హత్య



**తెలంగాణస్టేట్ బ్యూరో, భాస్కర్ చారి, మార్చి 15, మనవార్త.** ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధి చిలకానగర్ లో ఆదివారం రాత్రి దారుణ ఘటన చోటుచేసుకుంది. చిలకానగర్ ఆదర్శనగర్‌లోని సాయిబాబా ఆలయం సమీపంలో జరిగిన కత్తిపోటు ఘటనలో ఏఆర్ కానిస్టేబుల్ అక్కడికక్కడే మృతి చెందాడు. చెంగిచెర్లలోని ఆర్టీసీ కాలనీకి చెందిన సుధీర్ కుమార్ (39), హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ వింగ్‌లో ఏఆర్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్నారు. ఆదివారం రాత్రి సుమారు 8 గంటల ప్రాంతంలో ఆదర్శనగర్, చిల్కానగర్‌లోని సాయిబాబా ఆలయం సమీపంలో ఉండగా, అతని స్నేహితుడైన సంతోష్ నాయక్ కత్తితో దాడి చేసినట్లు తెలుస్తుంది. సంతోష్ నాయక్ సుధీర్ కుమార్ ని కడుపు మరియు మెడ భాగాల్లో కత్తితో పొడవడంతో, తీవ్ర గాయాల కారణంగా సుధీర్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారైనట్లు తెలిసింది. మృతుడు మరియు నిందితుడు ఇద్దరూ స్నేహితులేనని, అయితే హత్యకు గల అసలు కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించనున్నారు. కేసు నమోదు చేసి పరారీలో ఉన్న నిందితుడు సంతోష్ నాయక్ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

# ఎండాకాలంలో సన్‌స్క్రీన్ అవసరం పెరుగుతోంది



**డెస్క్,** ఎండాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సూర్య కిరణాల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బయట తిరిగే వారికి చర్మ సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అల్ట్రావయలెట్ కిరణాల ప్రభావంతో చర్మం నల్లబడటం, ఎండదెబ్బ, చర్మం ఎండిపోవడం వంటి సమస్యలు పెరుగుతున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో చర్మాన్ని రక్షించుకోవడానికి సన్‌స్క్రీన్ వినియోగం చాలా అవసరమని సూచిస్తున్నారు. సూర్యకిరణాల్లో ఉండే అల్ట్రావయలెట్ కిరణాలు చర్మంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఇవి ఎక్కువగా పడితే చర్మం రంగు మారడం, మచ్చలు ఏర్పడటం, కొన్నిసార్లు తీవ్రమైన చర్మ వ్యాధులు వచ్చే ప్రమాదం కూడా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఈ ప్రభావాన్ని తగ్గించడంలో సన్‌స్క్రీన్ ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఇది చర్మంపై ఒక రక్షణ పొరలా పనిచేసి కిరణాల ప్రభావాన్ని తగ్గిస్తుంది. సన్‌స్క్రీన్‌ను ఉపయోగించేటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. బయటకు వెళ్లే ముందు సుమారు 15 నుంచి 20 నిమిషాల ముందు సన్‌స్క్రీన్ రాయడం మంచిదని చెబుతున్నారు. అలాగే ఎండలో ఎక్కువసేపు ఉంటే రెండు గంటలకు ఒకసారి మళ్లీ రాయడం అవసరమని పేర్కొంటున్నారు. ముఖంతో పాటు మెడ, చేతులు, చెవులు వంటి బయటకు కనిపించే భాగాలకూ సన్‌స్క్రీన్ రాయడం ద్వారా చర్మాన్ని సమగ్రంగా రక్షించుకోవచ్చు. ఎండాకాలంలో సన్‌స్క్రీన్‌తో పాటు ఇతర జాగ్రత్తలు కూడా తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. మధ్యాహ్నం 11 నుంచి 3 గంటల మధ్య ఎండ తీవ్రంగా ఉండే సమయంలో బయట తిరగడం తగ్గించడం మంచిదని చెబుతున్నారు. తేలికపాటి బట్టలు ధరించడం, ఎక్కువగా నీళ్లు తాగడం, పండ్లు తినడం వంటి అలవాట్లు కూడా శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయని నిపుణులు సూచిస్తున్నారు.

# స్థిరంగా బంగారం ధరలు



**హైదరాబాద్,** దేశవ్యాప్తంగా నేడు బంగారం ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. నిన్న భారీగా తగ్గిన తర్వాత ఈరోజు మార్కెట్‌లో పెద్దగా మార్పులు కనిపించలేదు. యుద్ధ ప్రభావంతో బంగారం ధరలు పెరుగుతాయని భావించినప్పటికీ ప్రస్తుతం ధరలు తగ్గిన స్థాయిలోనే కొనసాగడం మార్కెట్ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది.గత వారం రోజులుగా పసిడి ధరలు వరుసగా తగ్గుతూ వస్తున్నాయి. మార్చి నెల ప్రారంభంలో నమోదైన గరిష్ఠ ధరలతో పోలిస్తే ప్రస్తుతం తులం బంగారంపై సుమారు ₹7,000 నుంచి ₹8,000 వరకు తగ్గుదల కనిపిస్తోంది. అమెరికా డాలర్ బలపడడం, అంతర్జాతీయ మార్కెట్లలో బాండ్ దిగుబడులు పెరగడం వల్ల పెట్టుబడిదారులు బంగారం కంటే ఇతర పెట్టుబడుల వైపు మొగ్గు చూపుతున్నారని నిపుణులు చెబుతున్నారు.దేశంలోని ప్రధాన నగరాల్లో పది గ్రాముల బంగారం ధరలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్, విజయవాడ, ముంబై, బెంగళూరు నగరాల్లో 22 క్యారెట్ల బంగారం ధర ₹1,46,350 కాగా 24 క్యారెట్ల బంగారం ధర ₹1,59,660గా ఉంది. ఢిల్లీలో 22 క్యారెట్ల బంగారం ₹1,46,500, 24 క్యారెట్ల బంగారం ₹1,59,810గా నమోదైంది. చెన్నైలో 22 క్యారెట్ల బంగారం ₹1,47,600 కాగా 24 క్యారెట్ల బంగారం ₹1,61,020గా ఉంది.బంగారంతో పాటు వెండి ధర కూడా అదే ధోరణిలో కొనసాగుతోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా కిలో వెండి ధర సుమారు ₹2,80,000 వద్ద ఉంది. నిన్న ఒక్కరోజే వెండి ధర కిలోకు దాదాపు ₹10,000 వరకు తగ్గడం గమనార్హం. మార్కెట్ పరిస్థితులను బట్టి రాబోయే రోజుల్లో ధరల్లో మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో పెరిగిన చికెన్ ధరలు



**హైదరాబాద్,** తెలుగు రాష్ట్రాల్లో చికెన్ ధరలు ఒక్కసారిగా పెరగడంతో మాంసం ప్రియులకు షాక్ తగిలింది. గత వారం వరకు సాధారణంగా ఉన్న ధరలు ఇప్పుడు గణనీయంగా పెరిగాయి. ముఖ్యంగా హైదరాబాద్ వంటి నగరాల్లో కిలో చికెన్ ధర సుమారు మూడు వందల యాభై రూపాయల వరకు చేరింది ధరలు పెరగడానికి ప్రధాన కారణంగా వేసవి ఎండల తీవ్రతను వ్యాపారులు చెబుతున్నారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా కోళ్లు మృతి చెందడం పెరిగిందని, దాంతో ఉత్పత్తి తగ్గిందని తెలిపారు. అలాగే పౌల్ట్రీ ఫారాల నుంచి సరఫరా సరిగా అందకపోవడం కూడా ధరల పెరుగుదలకు కారణమైంది. ఈ పరిస్థితిపై సాధారణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇక ఆదివారం రోజుల్లో సాధారణంగా చికెన్ వినియోగం ఎక్కువగా ఉండటంతో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో కూడా కిలో చికెన్ ధర మూడు వందల ఇరవై రూపాయల మార్కును దాటింది. ఎండల తీవ్రత ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో ధరలు ఇంకా పెరిగే అవకాశముందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.


# వంట గ్యాస్ కొరతతో

## పెరిగిన ఆహార పదార్థాల ధరలు



**హైదరాబాద్,** పశ్చిమాసియా ప్రాంతంలో కొనసాగుతున్న యుద్ధం ప్రభావంతో భారతదేశంలో చమురు, గ్యాస్ ధరలు భారీగా పెరిగాయి. దీనివల్ల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా తగ్గి హోటల్ వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఖర్చులు పెరగడంతో తప్పనిసరి పరిస్థితుల్లో హోటళ్లలో ఆహార పదార్థాల ధరలను పెంచాల్సి వస్తోంది.ఈ పరిస్థితి హోటల్ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వ్యాపారం మందగించడంతో ఇప్పటికే వేలాది చిన్న, మధ్యతరహా హోటళ్లు మూతపడ్డాయి. కొన్ని ప్రముఖ రెస్టారెంట్లు ఖర్చులు తగ్గించుకోవడానికి డైన్-ఇన్ సేవలను నిలిపివేసి కేవలం తీసుకెళ్లే సేవలను మాత్రమే అందిస్తున్నాయి. రవాణా ఛార్జీలు పెరగడంతో నిత్యావసర వస్తువుల సరఫరాపై కూడా ప్రభావం పడింది.కూరగాయలు, కిరాణా సరుకుల ధరలు కూడా పెరగడంతో మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం మరింత పెరిగింది. హోటళ్లలో రేట్లు పెరగడం వల్ల బయట తినే వారికి అదనపు ఖర్చు తప్పడం లేదు. అంతర్జాతీయ ఉద్రిక్తతలు తగ్గితే తప్ప ఈ ధరల పెరుగుదల నుంచి ఉపశమనం లభించే అవకాశాలు తక్కువగా ఉన్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

# పీఎఫ్ ఖాతాదారులకు కీలక సూచన పాత ఖాతాలను విలీనం చేసుకోవాలని సూచన






**న్యూఢిల్లీ,** ఉద్యోగులు తరచుగా ఉద్యోగాలు మారినప్పుడు ఒకే యూనివర్సల్ అకౌంట్ నంబర్ కింద అనేక పీఎఫ్ ఖాతాలు ఏర్పడటం సాధారణం. ప్రతి కొత్త కంపెనీ ఉద్యోగి కోసం అదే యూనివర్సల్ అకౌంట్ నంబర్ కింద కొత్త పీఎఫ్ ఖాతాను సృష్టిస్తుంది. అయితే ఈ ఖాతాలు ఆటోమేటిక్‌గా ఒకటిగా విలీనం కావు. అందువల్ల పాత పీఎఫ్ ఖాతాల్లో ఉన్న డబ్బును ప్రస్తుత యాక్టివ్ ఖాతాకు బదిలీ చేయాలని ఉద్యోగులకు నిపుణులు సూచిస్తున్నారు.పీఎఫ్ ఖాతాలను ఒకటిగా విలీనం చేయడం వల్ల పదవీ విరమణ పొదుపులు ఒకే చోట ఉండటంతో పాటు నిష్క్రియ ఖాతాలు తగ్గుతాయి. అలాగే ఉపసంహరణ సమయంలో ఆలస్యం లేకుండా డబ్బును సులభంగా ట్రాక్ చేయడానికి కూడా ఇది సహాయపడుతుంది. ఈ పథకాన్ని ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ నిర్వహిస్తుంది. ఇందులో ఉద్యోగి మరియు యజమాని ఇద్దరూ ఉద్యోగి ప్రాథమిక జీతం, డియర్‌నెస్ అలవెన్స్‌లో పన్నెండు శాతం చొప్పున పీఎఫ్ ఖాతాలో జమ చేస్తారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి పీఎఫ్ వడ్డీ రేటును సంవత్సరానికి 8.25 శాతంగా నిర్ణయించారు. ఈ వడ్డీ ఖాతాలోని మొత్తం నిల్వపై లెక్కించి ఆర్థిక సంవత్సరం చివరలో జమ చేస్తారు.ఇక పీఎఫ్ ఖాతాలను ఆన్‌లైన్‌లో విలీనం చేయడం కూడా చాలా సులభమైంది. సభ్యులు అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లి యూనివర్సల్ అకౌంట్ నంబర్, పాస్‌వర్డ్‌తో లాగిన్ కావాలి. తరువాత ఆన్‌లైన్ సేవల విభాగంలో ఒక సభ్యుడు – ఒక పీఎఫ్ ఖాతా ఎంపికను ఎంచుకోవాలి. అక్కడ కనిపించే వ్యక్తిగత వివరాలు, ప్రస్తుత యజమాని పీఎఫ్ ఖాతా వివరాలను ధృవీకరించి రిజిస్టర్డ్ మొబైల్ నంబర్ నమోదు చేయాలి. అనంతరం వచ్చిన ఓటీపీని నమోదు చేసి ధృవీకరించాలి. తరువాత విలీనం చేయాలనుకునే పాత పీఎఫ్ ఖాతా వివరాలను నమోదు చేసి డిక్లరేషన్ సమర్పించాలి.తర్వాత ప్రస్తుత యజమాని ఈ అభ్యర్థనను ఆమోదిస్తారు. ఆమోదం వచ్చిన తర్వాత ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ పాత పీఎఫ్ ఖాతాల్లో ఉన్న మొత్తాన్ని ప్రస్తుత ఖాతాకు బదిలీ చేస్తుంది. దీంతో ఉద్యోగులు తమ పదవీ విరమణ పొదుపులను ఒకే ఖాతాలో నిర్వహించుకోవచ్చు.

## "ధురంధర్ 2"పై భారీ క్రేజ్"ధురంధర్ 3" ప్లాన్‌లో దర్శకుడు ఆదిత్య ధర్



**హైదరాబాద్,** దేశవ్యాప్తంగా సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో "ధురంధర్ 2" ఒకటి. బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో, దర్శకుడు ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ సీక్వెల్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. పాన్ ఇండియా స్థాయిలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం అన్ని ప్రాంతాల్లో కూడా మంచి అడ్వాన్స్ బుకింగ్స్ నమోదు చేస్తూ ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది. "ధురంధర్" తొలి భాగం మంచి విజయాన్ని సాధించడంతో దాని కొనసాగింపుగా వస్తున్న "ధురంధర్ 2"పై అభిమానుల్లో భారీ ఉత్సాహం కనిపిస్తోంది. ముఖ్యంగా రణ్‌వీర్ సింగ్ నటన, ఆదిత్య ధర్ దర్శకత్వం కలిసిరావడంతో ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్‌కు వచ్చిన స్పందన కూడా ఈ చిత్రంపై ఉన్న క్రేజ్‌ను స్పష్టంగా తెలియజేస్తోంది. విడుదలకు ముందే అడ్వాన్స్ బుకింగ్స్ రికార్డు స్థాయిలో జరుగుతుండడంతో ఈ సినిమా సీక్వెల్స్‌లో కొత్త రికార్డులు సృష్టించే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో మరో ఆసక్తికరమైన సమాచారం సినీ వర్గాల్లో వినిపిస్తోంది. దర్శకుడు ఆదిత్య ధర్ ఇప్పటికే "ధురంధర్ 3"పై కూడా ఆలోచనలు ప్రారంభించినట్లు సమాచారం. "ధురంధర్ 2"కు వస్తున్న స్పందనను దృష్టిలో పెట్టుకుని కథను మరింత విస్తరించేలా మూడో భాగాన్ని కూడా తెరకెక్కించే ప్రణాళికలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం మూడో భాగానికి సంబంధించిన కథ రూపకల్పన దశలో ఉందని తెలుస్తోంది. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. "ధురంధర్ 2" బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధిస్తే మూడో భాగాన్ని కూడా పెద్ద స్థాయిలో తెరకెక్కించే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్స్, సామాజిక మాధ్యమాల్లో కనిపిస్తున్న ట్రెండ్‌ను చూస్తుంటే "ధురంధర్ 2"కు మంచి ఓపెనింగ్స్ వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అదే జరిగితే "ధురంధర్" చిత్రం సిరీస్‌గా మరింత విస్తరించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## సాయిపల్లవితో సంజయ్ లీలా భన్సాలీ చర్చలు క్రేజీ కాంబోపై ఆసక్తి






**హైదరాబాద్,**తమిళం, తెలుగు చిత్రాలతో పాటు దేశవ్యాప్తంగా మంచి అభిమాన వర్గాన్ని సంపాదించుకున్న నటీమణుల్లో సాయిపల్లవి ఒకరు. తన సహజ నటన, నృత్యంతో ప్రేక్షకులను ఆకట్టుకునే ఈ నటి గురించి వచ్చే ప్రతి వార్త కూడా అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తుంది. ప్రస్తుతం బాలీవుడ్‌లో తెరకెక్కుతున్న మహాకావ్య చిత్రమైన "రామాయణ"లో కూడా సాయిపల్లవి నటిస్తున్నట్లు ఇప్పటికే వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆమెకు సంబంధించిన మరో ఆసక్తికరమైన సమాచారం సినీ వర్గాల్లో వినిపిస్తోంది. ప్రముఖ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ రూపొందించబోయే ప్రముఖ నటి మధుబాల జీవిత కథ ఆధారిత చిత్రంలో ప్రధాన పాత్ర కోసం సాయిపల్లవిని సంప్రదించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ బయోపిక్ కోసం మొదట ఇతర బాలీవుడ్ నటీమణుల పేర్లు వినిపించినప్పటికీ, ప్రస్తుతం సాయిపల్లవి పేరు ప్రధానంగా చర్చకు వస్తోంది. సాయిపల్లవి హిందీ చిత్రరంగ ప్రవేశం చేయనున్న చిత్రం "ఏక్ దిన్" రెండు వేల ఇరవై ఆరు మే నెలలో విడుదల కానుంది. ఆ చిత్రం విడుదలకంటే ముందే భన్సాలీ చిత్రానికి సంబంధించిన ఈ వార్త బయటకు రావడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. సంజయ్ లీలా భన్సాలీ చిత్రాల్లో హీరోయిన్ పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యం ఉండటం తెలిసిందే. అలాంటి దర్శకుడి చిత్రంలో సాయిపల్లవి నటిస్తే అది మరింత ప్రత్యేకంగా నిలుస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇదే నిజమైతే సాయిపల్లవి సినీ జీవితంలో ఇది ఒక కీలక మైలురాయిగా మారే అవకాశముందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

# 'ఇది ఆరంభం మాత్రమే'

## భారత క్రికెట్ విజయాలపై రోహిత్ వ్యాఖ్యలు




**ముంబై,** గత కొంతకాలంగా భారత క్రికెట్ సాధిస్తున్న విజయాలపై భారత జట్టు స్టార్ ఆటగాడు రోహిత్ శర్మ ఆనందం వ్యక్తం చేశారు. ముంబైలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ పురుషుల జట్టుతో పాటు మహిళల జట్టు కూడా అంతర్జాతీయ వేదికలపై అద్భుత ప్రదర్శన చేస్తోందని ప్రశంసించారు. భారత క్రికెట్ ప్రస్తుతం అత్యున్నత స్థాయిలో ఉందని తెలిపారు. మహిళల జట్టు ప్రపంచకప్ గెలవడం, అనంతరం పురుషుల జట్టు టీ20 ప్రపంచకప్‌ను కైవసం చేసుకోవడం భారత క్రీడా చరిత్రలో ఒక గొప్ప మైలురాయి అని రోహిత్ పేర్కొన్నారు. ఈ విజయాలు కేవలం ఆరంభం మాత్రమేనని, ఇక్కడి నుంచి భారత క్రికెట్ మరింత ఎత్తులకు చేరుకుంటుందని అన్నారు. పురుషుల జట్టు, మహిళల జట్టు రెండూ ప్రస్తుతం మంచి ఊపులో ఉన్నాయని రోహిత్ శర్మ చెప్పారు. ఇదే విజయ పరంపరను భవిష్యత్తులో కూడా కొనసాగించాలని ఆకాంక్షించారు.

## బౌలర్లు ప్లాన్ మార్చారు వైభవ్ సూర్యవంశీకి ముప్పు: ఉతప్ప హెచ్చరిక




**ముంబై,** ఐపీఎల్‌లో మెరుపు ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించిన యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీపై భారత మాజీ క్రికెటర్ రాబిన్ ఉతప్ప ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాజస్థాన్ రాయల్స్ తరపున అరంగేట్రం చేసిన వైభవ్ కేవలం 14 ఏళ్ల వయసులోనే 35 బంతుల్లో శతకం సాధించి క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాడు. అయితే రాబోయే సీజన్‌లో అతడికి సవాళ్లు మరింత పెరుగుతాయని ఉతప్ప హెచ్చరించారు. గత ఏడాది కాలంగా వైభవ్ ఆడుతున్న మ్యాచ్‌లను గమనిస్తున్నానని ఉతప్ప తెలిపారు. అతడిలో ప్రతిభ ఉన్నప్పటికీ ఇప్పటివరకు కొంతవరకు అదృష్టం కూడా కలిసొచ్చిందని అభిప్రాయపడ్డారు. ఉన్నత స్థాయి బౌలర్లను ఎదుర్కొనే సమయంలో అసలైన పరీక్ష మొదలవుతుందని చెప్పారు. ఇప్పటికే వైభవ్ బ్యాటింగ్ శైలి, బలహీనతలు ప్రత్యర్థి జట్లకు తెలిసిపోయాయని ఉతప్ప పేర్కొన్నారు. బౌలర్లు ఇప్పుడు అతడిని ఎలా కట్టడి చేయాలో ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారని తెలిపారు. అందువల్ల ఐపీఎల్ 2026 సీజన్ వైభవ్ సూర్యవంశీకి ఒక పెద్ద నేర్చుకునే దశగా మారే అవకాశముందని చెప్పారు. గత సీజన్‌లా సులభంగా రికార్డులు సృష్టించడం కష్టమవుతుందని, ప్రత్యర్థి జట్లు అతడిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టే అవకాశముందని ఉతప్ప వ్యాఖ్యానించారు.

Edited, Published & Owned by **BHUPATHI SANTHOSH.** Printed at PARAHUSHAR PRINTING PUBLICATIONS, H. NO. 1-6-27/2,SRI NAGAR COLONY, MAHABUBABAD, WARANGAL, TELANGANA-506101.Published at Jammikunta, karimnagar,Telangana-505122. EDITOR: BHUPATHI SANTHOSH. Cell: 9247819181 | **RNI No: TGTEL/25/A1882,**Email:Mana vaartha tg. Daily@gmail.com